vaarthapatrika.com

# వార్తపత్రిక

జాతీయ తెలుగు దినపత్రిక

vaarthapatrika.com / epaper.vaarthapatrika.com

TS-02-0297488

విలేకరులు కావలెను

వార్తపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న వార్తపత్రిక దినపత్రికలో బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సాహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490617567- 87903 15659

ఎడిటర్ : మరే ఛిన్న బాబు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 113 ఆదివారం , మే 24, 2026 , పేజీలు -08 వెల : 2 /-

## భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం



**అమెరికాకు భారత్ కీలక భాగస్వామి**

**ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు**

**న్యూఢిల్లీ,మే 23 :** భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నా యని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. మిగతా2లో...

## దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

**చిన్నారుల అంతర్థానంపై సుప్రీంకోర్టు ఆందోళన**

**కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి**

**అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం**



**న్యూఢిల్లీ,మే 23 :** దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ మిగతా2లో...



## హరీష్ రావువి పగటి కలలు

**అధికారంలోకి రావడం కల్ల**

**ఫ్యూచర్ సిటీపై బాధ్యతారాహిత్య ప్రకటన**

**అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్: మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,మే 23 :** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండి పడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. మిగతా2లో...

# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

● ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరు ● పాత ఇందిరమ్మ ఇల్ల పూర్తికి నిధులు కేటాయింపు ● జూన్ 1న కొఠారి గ్రామంలో ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం ● కేబినేట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పొంగులేటి




**హైదరాబాద్,మే 23 :** రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి మిగతా2లో...



## కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

**- లారీని ఢీకొన్న క్రూజర్..ఐదుగురు దుర్మరణం**

**బెంగళూరు,మే 23 :** కర్ణాటకలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లాడ్లాపూర్ సమీ పంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెంది న ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వేగంగా వెళ్తున్న క్రూజ ర్ వాహనం ముందున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మిగతా2లో...

## రైతులకు ఆధునిక టెక్నాలజీలను అందించాలి

**- డిమాండ్ ఉన్న పంటలనే రైతులు సాగు చేయాలి**

**- వ్యవసాయ వర్సిటీలో విత్తన వారోత్సవాలు ప్రారంభించిన మంత్రి తుమ్మల**




**హైదరాబాద్,మే 23 :** భవిష్యత్ వ్యవసాయ రంగంలో కూలీల సమస్య అధికమయ్యే అవకాశం ఉన్నందున డ్రోన్స్ వినియోగం ప్రాముఖ్యతని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేసారు. తదనుగుణం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డ్రోన్ ఆధారిత వివిధ వ్యవసాయ విధానాల్ని మంత్రి అభినందించారు. రాజేంద్ర నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మిగతా2లో...

## యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

**- వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ**



2లో

## దేశవ్యాప్తంగా భానుడి భగభగలు


**బయటకు రావాలంటే భయపడతున్న జనాలు**



**న్యూఢిల్లీ,మే 23 :** దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ మిగతా2లో...

## వ్యాపార ఎదుగుదలకు తోడ్పడాలి

**- చార్టెడ్ అకౌంటెంట్లకు కెటిఆర్ హితవు**



**హైదరాబాద్,మే 23 :** చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు. గచ్చిబౌలిలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' మిగతా2లో...

## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

**- దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు**

**- ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు**

**- 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**




**హైదరాబాద్,మే 23 :** దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యో గాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపా రు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిం చారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నార న్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మిగతా2లో...

## బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

**- హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్**



**హైదరాబాద్,మే 23 :** బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నా రా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాం లోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందు కు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా2లో...

## విలీన జీహెచ్ఎంసీ వార్డులకు 20,000 లీటర్ల ఉచిత నీటిని కోరిన ఆల్ కాలనీస్ ఫెడరేషన్; చర్యకు హామీ ఇచ్చిన హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ



**రంగారెడ్డి జిల్లా (ప్రతినిధి) గండిపేట్ వార్తాపత్రిక:** బండ్లగూడ జాగీర్, హైదర్‌షాకోట్, కిస్మత్‌పూర్ వార్డుల ఆల్ కాలనీస్ ఫెడరేషన్ (ఏసీఎఫ్) ప్రతినిధులు శుక్రవారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఐఏఎస్ కి వినతిపత్రం సమర్పించారు. కొత్తగా విలీనమైన జీహెచ్ఎంసీ వార్డుల్లో 20,000 లీటర్ల ఉచిత నీటి పథకాన్ని అమలు చేయాలని కోరారు. జీహెచ్ఎంసీలో భాగమైనప్పటికీ బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్ ప్రాంతాల ప్రజలకు ఇప్పటివరకు ఈ పథకం లబ్ధి చేకూరలేదని ప్రతినిధి బృందం తెలిపింది.

గంధంగూడతో పాటు వార్డుల్లోని ఇతర ప్రాంతాల్లో వినియోగంలో లేని నీటి రిజర్వాయర్లను వెంటనే పునరుద్ధరించి, ప్రజలకు నీటి సరఫరా పెంచాలని ఏసీఎఫ్ విజ్ఞప్తి చేసింది. వినతిపై స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి, ఉచిత నీటి అంశాన్ని సీఎంఓ కార్యా లయం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే, వినియోగంలో లేని రిజర్వాయర్లను వెంటనే తనిఖీ చేసి, ప్రజా వినియోగానికి అందుబా టులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశిం చారు.

**హాజరైన ఏసీఎఫ్ సభ్యులు:**

- **అధ్యక్షులు: వినయ్ రెడ్డి**
- **ప్రధాన కార్యదర్శి: నరేందర్ బాబు**
- **ఉపాధ్యక్షులు: నదీమ్**
- **కార్యవర్గ సభ్యులు: విజయ్ పద్మనాభన్, రవి రాజా**

సానుకూలంగా స్పందించిన హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డికి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది.

## లయన్స్ క్లబ్ మఖ్తల్ భీమా నూతన అధ్యక్షుడిగా లయన్ తంగిడి నాగరాజు ..

**వార్తాపత్రిక,,, 23/5/20226/ నారాయణపేట** జిల్లా మక్తల్ సెక్రటరీగా లయన్ ఎస్.రమేశ్ రావు, కోశాధికారిగా లయన్ బి.అంబాదాస్ రావు... 2026- 2027 సంవత్సరానికి నూతన కార్యవర్గ ఎంపిక..లయన్స్ క్లబ్ మక్తల్ భీమా నూతన అధ్యక్షుడిగా తంగిడి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన ఎన్నికలో పాస్ట్ రీజియన్ చైర్మన్ లయన్ ఎస్.రమేశ్ రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, సభ్యులు అందరూ కలిసి నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2026-27 సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ మఖ్తల్ భీమా నూతన అధ్యక్షుడిగా తంగిడి నాగరాజు, సెక్రటరీగా రమేశ్ రావు, కోశాధికారిగా బి.అంబాదాస్ రావు ,ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సభ్యులందరూ నూతన కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. డిస్ట్రిక్ట్ 320ఏ లో మఖ్తల్ లయన్స్ క్లబ్‌కు ప్రత్యేక స్థానం ఉందని, సేవా కార్యక్రమాల్లో రాష్ట్రం లోనే ముందంజలో ఉన్నఅతి కొద్ది లయన్స్ క్లబ్ లలో మఖ్తల్ క్లబ్ కూడా ఉందని, ఇదే సాంప్రదాయాన్ని నూతన కమిటీ కూడా కొనసాగించాలని కోరారు. అనంతరం 2025-26 కమిటీ ప్రస్తుత అధ్యక్షుడు సత్యాంజనేయులు, సెక్రటరీ అంజన్ కుమార్, కోశాధికారి ఆడెం సత్యనారాయణ... నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపి, అతి త్వరలో ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఏర్పాటు చేసి, బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాస్ట్ రీజియన్ చైర్మన్ డాక్టర్ శ్రీరామ్, సీనియర్ సభ్యులు బి. కొండయ్య, కోళ్ల వెంకటేష్, అనుగొండ శ్రీనివాస్, గవినోళ్ల జైపాల్ రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ మణికంఠ గౌడ్, సభ్యులు సుకన్య శేఖర్, సాయి జ్యోతి వెంకటయ్య, వట్టం రతన్ కుమార్ గుప్తా, కిరణ్, అశోక్, పాపిరెడ్డి, రఘురాం, అరుణ టీచర్, సుజాత టీచర్, జయశ్రీ టీచర్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.




## "దుర్గా రమేష్ ఆశయ సాధనకు పిలుపు"



- **సిపిఐ ఎదుగుదలకు దుర్గా రమేష్ సేవలు చిర స్మరణీయం**
- **గిరిజన గ్రామాల్లో ప్రజానాయకుడిగా మంచి గుర్తి ంపు**
- **ఆయన ఆశయాల కోసం యువత ముందుకు రా వాలి**

**వార్త పత్రిక భద్రాచలం ఆర్ సి రిపోర్టర్ కోట దిలీప్.:** స్థానిక భద్రాచలం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డివిజన్ కార్యాలయంలో మాజీ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సిపిఐ నాయకులు కీర్తిశేషులు వాతాడి దుర్గా రమేష్ గారి 14వ వర్ధంతి సభ ఏఐఎస్ ఎఫ్ మాజీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా రమేష్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సిపిఐ డివిజన్ కార్యదర్శి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భద్రాచలం డివిజన్లో దుర్గా రమేష్ సిపిఐ పార్టీ ఎదుగుదలలో ఆయన పాత్ర అమోఘమని తెలిపారు గిరిజన గ్రామాలలో తనకంటూ పార్టీ కార్యకర్తల్లో ప్రజల్లో ఒక మంచి ముద్ర వేసుకున్నారని అన్నారు అదేవిధంగా వ్యవసాయ కార్మిక సంఘాల్లో పనిచేసే పార్టీ పెరిగే విషయంలో నిరంతరం కృషి చేశారని అన్నారు. దుర్గా రమేష్ లేని లోటు పార్టీకి ఇప్పటికీ చాలా తీవ్ర నష్టమేనని కొనియాడారు. దుర్గారమేష్ ఆయన ఆశయ సాధన కోసం ఇప్పుడున్న ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ పార్టీ కార్యకర్తలు కార్మిక సంఘ నాయకులు అందరూ కష్టపడి పని చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సీనియర్ నాయకులు వాతారి దుర్గారావు, భాస్కరరావు మారెడ్డి శివాజీ, నరసింహమూర్తి, బచ్చు శ్రీనివాస్, పట్టణ ఏఐ వై ఎస్ నాయకులు సాధన పల్లి సతీష్ కొక్కిరేణి అశోక్ కుమార్, నారపొంగు యేసు, పసుపులేటి సాయి, కుమారి, మహమ్మద్ వలి దాసరి శేఖర్, సీతారామరాజు, నాగేంద్ర, కృష్ణయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## బైక్ పై వెళ్తూ పడిపోయిన వృద్ధుడు మృతి



**చౌటుప్పల్, మే 23,(వార్త పత్రిక);** చౌటుప్పల్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామ శివారులో శనివారం మధ్యాహ్నం వృద్ధుడు ఆకస్మికంగా కుప్పకూలి మృతి చెందాడు. మనవడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం మందోల్లగూడెం గ్రామానికి చెందిన దేవరకొండ శంకరయ్య (65) వృత్తిరీత్యా కార్పెంటర్. శనివారం మధ్యాహ్నం ఆయన తన వ్యక్తిగత పని నిమిత్తం మనుమడు మొకరోజు మణికంఠతో కలిసి బైక్ (TS 30 ఖ 8907) పై చౌటుప్పల్ వచ్చారు. పని ముగించుకుని తిరిగి గ్రామానికి బయలుదేరారు. మార్గ మధ్యలో మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో లింగారెడ్డిగూడెం గ్రామ పరిధి లోని మార్లమైసమ్మ గుడి ఆర్చ్ సమీపానికి చేరుకోగానే, శంకరయ్యకు ఒక్కసారిగా కళ్ళు తిరగడం ప్రారంభమైంది. వెంటనే వెనుక కూర్చున్న మనవడికి "కళ్ళు తిరుగు తున్నట్లు అనిపిస్తోంది" అని చెబుతూ బైక్‌ను రోడ్డు పక్కకు ఆపారు. వాహనం ఆపిన కొద్దిసేపటికే ఆయన తీవ్ర అస్వస్థతకు గురై అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయారు. కంగారుపడిన మనవడు స్థానికుల సహాయంతో వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. శంకరయ్యను అత్యవసరంగా చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మధ్యాహ్నం 2 గంటల సమయంలో పరీక్షి ంచిన డ్యూటీ డాక్టర్.. ఆయన అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృ తుడి కుమారుడు దేవరకొండ శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ దర్యాప్తు ప్రారంభించారు.

# విష జ్వరాలు ప్రబలితే కారకులు ఎవరు? దీనికి బాధ్యులు ఎవరు?





**ములుగు జిల్లా (ప్రతినిధి) వార్తాపత్రిక** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ కేంద్రమైన పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో అటు ప్రజలు ఇటు ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది అధికారులు పేరుకుపోయిన చెత్త వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ప్రజలు ప్రతి గ్రామాలలో ప్రాంతాలలో చెత్త నిల్వ ఉండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న అధికారులు ప్రాంతాల మీద అవగాహన లేక పారిశుద్ధ్య సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే చెత్త నుండి వచ్చే దుర్గంధం వలన దోమల బారిన పడి మలేరియా వంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రజలకు సోకే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు అధికారులుగా విధులు నిర్వహిస్తూ ఇక్కడే ఉండవలసిన పంచాయతీ సెక్రెటరీ గత మూడు నెలల రూము దొరకడం లేదని చెప్పడం హాస్యాస్పదమని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు వారంలో మూడు రోజులు ఉద్యోగానికి వస్తున్నట్లు మిగతా రోజుల్లో అధికారులు ఎవరూ కనిపించడం లేదని ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే అధికారుల తీరు ఇలాగే ఉందని స్థానిక ప్రజలు తెలియజేస్తున్నారు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టక కొంతమంది అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రజల ప్రాణాల మీదకు తెస్తుందని అన్నారు అలాగే స్పష్టమైన ఆదేశాలు జిల్లా కలెక్టర్లకు ఇచ్చారని వాటిని అమలు పరిచే తీరులో ఏ అధికారి నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు చేపట్టే విధంగా హెచ్చరికలు జారీచేసిన పంచాయతీ అధికారులు మాత్రం జిల్లా కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానిక ప్రజల ఆరోపణలు. ఇప్పటికే మురుగు కాలువలు ఎక్కడికక్కడ డ్రైనేజీ వ్యవస్థ నాశనం అయిపోయిందని పారిశుద్ధ్య పనులు చేయించడంలో పంచాయతీ ఈవోలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొన్ని రోజుల్లో రానున్న వర్షాలు వలన డ్రైనేజీలు పొంగి మురికిమయం అవడం ఖాయమని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ నిర్లక్ష్య ధోరణి వీడి ప్రజాప్రతినిధులు ఉన్నత అధికారులు చూపిన బాటలో విధులను నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడే విధంగా ప్రయత్నాలు మొదలు పెట్టాలని పన్నులు వసూలు చేసే విధానంలో ఉన్న శ్రద్ధ పారిశుద్ధం మీద కూడా చూపాలని స్థానిక ప్రజలు అధికారులకు విన్నవించుకుంటున్నట్లు తెలిపారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికతో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సంక్షేమ పథకాలకు అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలి జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి



**ములుగు జిల్లా (ప్రతినిధి) వార్త పత్రిక** జూన్ రెండవ తేదీ నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికతో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని, సంక్షేమ పథకాలకు అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలని, జూన్ రెండవ తేదీ నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు చేస్తామని, ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయబోతున్నమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా స్థాయి సమావేశాన్ని లీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర గేయం "జయ జయహే తెలంగాణ" ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని తెలిపారు. 2026 మార్చి 6 నుండి జూన్ 12 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలు పూర్తి చేసుకొని నేడు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, జిల్లా స్థాయి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మే 18 నుండి 23 వరకు జరుగుతున్న "యువత మరియు క్రీడలు" వారోత్సవాలు స్ఫూర్తితో యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నరకం వడ్లకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, పథకాల అమలు చేస్తున్న తీరును వివరించారు. ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం,రోజు విడిచి రోజు రాగి జావ, వేడి పాలు అందించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పిస్తామని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరిస్తామని, దివ్యాంగ ఇంటర్ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పంట వైవిధ్యీకరణ, సహజ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామన్నారు. అధికారులు ప్రజలతో సన్నిహితంగా మమేకమైతు పారదర్శకతతో పథకాలను అమలు చేయాలని మంత్రి సూచించారు. లబ్ధిదారుల జాబితాను పథకాల వారీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న రామచంద్రపూర్ గ్రామ శివారులోని 10 వేల ఎకరాల పై చిలుకు భూములకు రీ సర్వే నిర్వహించమన్నారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించడం జరిగిందని, ఆలయ అభివృద్ధి కోసం 22 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించి నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. ఆలయ పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ములుగు నియోజకవర్గానికి అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించామని, ములుగు జిల్లాలో నూతనంగా 38వేల పైచిలుకు పెన్షన్లను జూన్ రెండవ తేదీన అందించనున్నట్లు తెలిపారు. పథకాల అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి సమస్యలు లేవని ధాన్యం తరలించడానికి లారీలు సరిపడా అందుబాటులో ఉన్నాయని రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ములుగు జిల్లా స్థానిక యువతి యువకులను నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని 80 నుంచి సుమారు 100 ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బహుళ జాతి కంపెనీలతో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ములుగు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండే విధంగా కృషి చేయాలని సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్లు గ్రామాల సర్పంచ్‌లు గ్రామ అభివృద్ధికి కట్టుబడి కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యలను, కష్టాలను, కన్నీళ్లను తుడవడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామాలు నిరంతరం పరిశుభ్రంగా ఉండే విధంగా చూడడం కోసం పారిశుధ్య కార్మికులను సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు ప్రభుత్వం ఇప్ప చెట్ల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తుందని ఇప్ప పువ్వుతో అనేక లాభాలు ఉన్నాయన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25వ తేదీ నుంచి మహిళా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పూర్తయిన కార్యక్రమాలు, నిర్వహించిన కార్యక్రమాల వారీగా జరిగిన అభివృద్ధి, వివిధ పథకాల లబ్ధిదారుల సంఖ్యను తెలియజేశారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ప్రతి అర్హుడికి చేరవేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామసభలలో, ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలలో స్వీకరించిన వినతులను సత్వరమే పరిష్కరిస్తున్నామని అన్నారు. అధికారులు ఫీల్డ్ స్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలని, లబ్ధిదారుల జాబితాను పథకాల వారీగా సిద్ధం చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంత్రి అనసూయ సీతక్క స్త్రీ నిధి ద్వారా 112 మహిళా సంఘాలకు 2 కోట్ల 25 లక్షల రూపాయలను, బ్యాంకు లింకేజి ద్వారా 175 మహిళ సంఘాలకు 16 కోట్ల 15 లక్షల రూపాయలను, ములుగు మున్సిపాలిటీ మెప్మ 25 సంఘాలకు రెండు కోట్ల 2 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 140 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. పెగడపెల్లి, కాసిందేవి పేట, రాయినిగూడెం గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాద్ కేకన్, ఐ టి డి ఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వస్సల్ టోప్పో, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ రవీందర్ రెడ్డి,ఆర్డీవో వెంకటేష్, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వార్త పత్రిక లో వచ్చిన "రాత్రి వేళల్లో ఏదేచ్ఛగా అక్రమంగా మట్టి, ఇసుక తరలింపు ట్రాక్టర్లు,టిప్పర్ల ద్వారా మట్టిని , ఇసుకను తరలిస్తున్న మాఫియా" కథనానికి స్పందించిన అధికారులు కొత్తపల్లి అక్రమ క్వారీలో హిటాచిలను సీజ్ చేసిన మండల అధికారులు

**మిడ్జిల్ మే 23 , వార్త పత్రిక** మిడ్జిల్ మండల పరిధి కొత్తపల్లిలో మట్టి , ఇసుక వార్త పత్రిక లో వచ్చిన వార్తను స్పందిస్తూ పత్రిక విలేకరులు వ్రాసిన కథనానికి స్పందించి. అక్రమ ఇసుక మాఫియాను మండల తాసిల్దార్ గంగాపురం రాఘవేందర్ రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ ఆర్.ఐ అంబిక ఇసుక దళారుల హిటాచిలను , అక్కడ ఉన్న బండ్లను శనివారం సీజ్ చేసినారు.

అధికారులకు భారతీయ జనతా పార్టీ , మండల రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలిపారు. నీతి నిజాయితీతో మండల ప్రజలకు సేవలు అందిస్తూ మిడ్జిల్ మండల అభివృద్ధికి తోడ్పడాలని రైతులు కోరారు.




## రైతు పొలంలో మద్యం సేవిస్తే వారిపై కేస్ పెట్టాలి అన్న రైతులు



**వార్తాపత్రిక,,** 23/5/26/ నారాయణపేట జిల్లాలోని గ్రామాల చుట్టూ ముట్టు రైతుల పొలాలో మందు త్రాగుతున్న వారిపై దాడులు చేసి కేసు నమోదు చేయాలి. అదేవిధంగా రైతుల పొలాల్లో మందు త్రాగిన వారు పట్టుబడితే ఎవరు అయితే మందు అమ్మినరో ఆ బెల్ట్ షాపు యజమానిపై కూడా కేసు నమోదు చేస్తాం అని సంబంధిత శాఖల అధికారులు నోటీసులు జారీ చేయాలి. రైతులు అన్నారు, అదేవిధంగా పల్లెటూర్లలో బెల్ట్ షాపులు ఎత్తివేయాలని అన్నారు.

## ప్రచురణార్థం/ ప్రసారార్థం:- అసేంట్ భూములకు పట్టాలి ఇవ్వాలి




తాడ్వాయి మండలం మేడారం కొత్తూరు గ్రామం తేదీ:-22/05/2026 అసైనడ్ భూములకు హక్కు పట్టాలు వెంటనే ఇవ్వాలని అంబేద్కర్ వజన సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పేదల జీవనాధారంగా ఉన్న అసైనడ్ భూములను కొంతమంది ప్రభావశీలులు తమకు అనుకూలంగా వినియోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని సంఘం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ భూములను ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారు. పేదల కోసం కేటాయించిన భూములను రక్షించి, అర్హులైన కుటుంబాలకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని అంబేద్కర్ యువజన సంఘంగా కోరారు.ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## అసైన్డ్ భూములకు పట్టాలి ఇవ్వాలి

**ములుగు జిల్లా (ప్రతినిధి) వార్త పత్రిక** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం కొత్తూరు గ్రామం (జంపంగవాయి) అసైన్డ్ భూములకు హక్కు పట్టాలు వెంటనే ఇవ్వాలని అంబేద్కర్ యువజన సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పేదప్రజల జీవనాధారంగా ఉన్న అసైన్డ్ భూములను కొంతమంది ప్రభావవంశీయులు తమకు అనుకూలంగా వినియోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని సంఘం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ భూములను ఇతర అవసరాలకు కోసం మళ్లించడం వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోతున్నారు. పేదల కోసం కేటాయించిన భూములను రక్షించి, అర్హులైన కుటుంబాలకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని అంబేద్కర్ యువజన సంఘనాయకులు కోరారు ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మళ్లీ మళ్లీ రాయాల్సిందే!



ఎండలు మండిపోతున్నాయ్. బయట తిరగక తప్పని పరిస్థితి. ఈ ఎండల్లో చర్మాన్ని కాపాడేందుకు సన్‌స్క్రీన్ లోషన్లు ఉన్నాయి. చర్మం రంగు మారకుండా, ఏజింగ్ సమస్య రాకుండా, వేడి వల్ల ముఖం కందిపోకుండా సన్‌స్క్రీన్ లోషన్లు రక్షణ కల్పిస్తాయని చాలామంది నమ్ముతున్నారు. ఈ లోషన్లు చర్మాన్ని కాపాడేది నిజమే.కానీ, ఒకసారి రాసుకుంటే చాలు ఇక రోజంతా కాపా డుతుందని అనుకోవడం భ్రమ. కాబట్టి బయట కాలుపెట్టే ముందు సన్‌స్క్రీన్ రాసుకుని వెళ్తే దాని ప్రభావం మూడు నుంచి నాలుగు గంటలు మాత్రమే ఉంటుందట. ముఖాన్ని, చర్మాన్నిరు దుద్దకోవడం, ఇతర వస్తువులు తాకడం వల్ల సన్ స్క్రీన్ పొర తొలగిపోతుంది. ఎండ వేడిమికి దాని ప్రభావం తగ్గిపోతుంది. కాబట్టి రోజంతా బయ ట తిరగాల్సి వస్తే మధ్య మధ్యలో సన్‌స్క్రీన్‌లో షన్‌ని రాసుకోవడం అవసరమని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఎండకు చర్మం నల్లబడడం, ఎర్రగా కందిపోవడంలాంటి సమస్యలతో బాధపడేవాళ్లు ఈ జాగ్రత్త పాటించాలని సూచిస్తున్నారు. కేవలం ఒకసారి రాసుకుని సాయంత్రం వరకు ఎండలో తిరిగితే చర్మానికి కలి గే ప్రయోజనం అంతంత మాత్రమే అని చెబు తున్నారు.

# క్రీడల వల్ల పోటీ తత్వం ఐక్యత భావం పెంపొందుతుంది





99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్ వార్తా పత్రిక , రాజేంద్రనగర్, మే 23, క్రీడలతో పోటీ తత్వం సోదర భావం ఐక్యత భావం పెంపదుతాయని నిర్వాహకులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా యువజన సేవలు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్ -2026, ముగింపు కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, తెలంగాణ స్టేట్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మల్లారెడ్డి రాంరెడ్డి, జిల్లా యువజన సేవలు క్రీడల అధికారి స్వర్ణలత, రంగారెడ్డి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మనోహర్ తదితరులు హాజరై కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కప్ -2025 రెండో ఎడిషన్ పోటీలలో పథకాలు సాధించిన రంగారెడ్డి జిల్లా క్రీడాకారులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత జట్టు విభాగాలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ వేడుకలో అభినందించనున్నారు అని అన్నారు .మల్ల కుంబ్ క్రీడల్లో ఆదర్శ్ విద్యాలయ బుద్వేల్‌కు చెందిన శాలిని కాంస్య పథకం సాధించింది, అత్యాపత్య బాలుర జట్టు కూడా కాంస్య పథకాన్ని గెలుచుకొని జిల్లా గౌరవాన్ని నిలబెట్టాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ప్రభాకర్ కార్యదర్శి రంగారెడ్డి జిల్లా, పరమేష్ ఉపాధ్యక్షులు రంగారెడ్డి జిల్లా, సీనియర్ క్రీడాకారులు నీలేష్ పవన్ పాల్గొననున్నారని తెలిపారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కు ఘనంగా సన్మానించిన తుగ్గలి నవీన్ రెడ్డి



**పత్తికొండ/తుగ్గలి:( వార్త పత్రిక):-**నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండకు విచ్చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి నవీన్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. శనివారం రోజున పత్తికొండ మండలంలోని చక్రాల గ్రామానికి చెందిన ఆర్.ఎస్.ఎస్ సంఘ మిత్రుడు సుధాకర్ కలవడానికి వచ్చిన ఆయనను బిజెపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకుల,కార్యకర్తల ఆధ్వర్యంలో ఆయన చక్రాల గ్రామంలో తమ ఆర్ఎస్ఎస్ సంఘ మిత్రుడు సుధాకర్‌ను కలిశారు. కేంద్ర మంత్రిగా ఉంటూ తమ సంఘ మిత్రుడిని గుర్తుంచుకొని కలవడానికి రావడం చాలా గొప్ప విషయమని బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి తెలియజేశారు. అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేయాలని బిజెపి శ్రేణులకు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలాల అధ్యక్షులు నరేష్, లక్ష్మన్న,శంకర్ బాబు,బిజెపి నాయకులు దండి మల్లికార్జున,రామ్మోహన్, మార్కెట్ డైరెక్టర్ గోవర్ధన్, భాస్కర్ రెడ్డి, బ్రహ్మయ్య తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం వర్షార్పణం



**●ఉమ్మడి జిల్లా రైతులను నిండా ముంచిన అకాల వర్షం**
**●మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో పూర్తిగా తడిచిన మక్క, ధాన్యం**
**●టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకునేందుకు రైతన్న పాట్లు**
**●నష్టపోయి కన్నీరే మిగిలిందని పలువురు అన్నదాతల ఆవేదన**

**మహబూబ్‌నగర్, మే 23 :** అకాల వర్షాలు రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈదురు గాలులకుతోడు వర్షం కురవడంతో ఆరబోసిన మక్కలు, ధాన్యం తడిచిపోయింది. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, ఖిల్లాఘణపురం, కొత్తకోట, రాజోళి, మహబూబ్‌నగర్‌లో వాన పడింది. నవాబ్‌పేట, ఆత్మకూరులో వడగండ్ల వర్షం కురిసింది. దీంతో మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. తెలంగాణ సమాచారం కొందరు టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకోగా.. మరికొందరు కవర్లు కప్పేలోగా వర్షార్పణమైంది. ఇన్నాళ్లు చేసిన కష్టమంతా నీటి పాలైందని దిగాలు చెందారు. వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకు నేందుకు నానా ఇబ్బందులు పడ్డా రు. యార్డుల్లో వరి, మక్కను 20రోజులుగా కా పాడుకుంటూ వస్తే.. చివరకు వరుణదేవుడు తమను నిండా ముంచాడని ఆవేదన చెందారు. కష్టపడి పండించిన పంటను తృప్తిగా అమ్ముకోలేని దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**పలు చోట్ల ఈదురుగాలుల బీభత్సం**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో శనివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మహబూబ్‌నగర్ బైపాస్, రహదారుల వెంట ఉన్న చెట్లు, స్తంభాలు విరిగిపడ్డాయి. కలెక్టర్ కార్యాలయం సమీపంలో నిర్మించిన బస్టాండ్ కొట్టుకుపోయింది. పిస్తా హౌస్ సమీపంలో కారుపై చెట్టు పడింది. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ గాలి దుమారం రేగింది.

## శంషాబాద్ శ్రీనివాస ఎంక్లవ్ లో అక్రమ నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలి



**వార్త పత్రిక , రాజేంద్రనగర్, మే 23,** శంషాబాద్ పురపాలక పరిధిలోని శ్రీనివాస ఎంక్లేవ్ లో విచ్చలవిడిగా భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్న అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధి జీవో 111 అమల్లో ఉంది, జీవో ఉద్దేశం నివాస యోగ్యమైన ఇల్లు మాత్రమే నిర్మించుకోవాలి. కానీ ఇక్కడ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ కాంప్లెక్స్‌లకు తెరలేపుతున్నారని వీటిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పురపాలక పరిధిలో పలుచోట్ల ఇలాంటి నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంలో మతలబ్ ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణదారులపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఘనంగా స్వాగతం పలికిన తుగ్గలి నవీన్ రెడ్డి



**పత్తికొండ/తుగ్గలి(వార్తాపత్రిక):-** నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండకు విచ్చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి నవీన్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. శనివారం రోజున పత్తికొండ మండలంలోని చక్రాల గ్రామానికి చెందిన ఆర్.ఎస్.ఎస్ సంఘ మిత్రుడు సుధాకర్ కలవడానికి వచ్చిన ఆయనను బిజెపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకుల,కార్యకర్తల ఆధ్వర్యంలో ఆయన చక్రాల గ్రామంలో తమ ఆర్ఎస్ఎస్ సంఘ మిత్రుడు సుధాకర్‌ను కలిశారు. కేంద్ర మంత్రిగా ఉంటూ తమ సంఘ మిత్రుడిని గుర్తుంచుకొని కలవడానికి రావడం చాలా గొప్ప విషయమని బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి తెలియజేశారు. అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేయాలని బిజెపి శ్రేణులకు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలాల అధ్యక్షులు నరేష్, లక్ష్మన్న,శంకర్ బాబు,బిజెపి నాయకులు దండి మల్లికార్జున,రామ్మోహన్, సిసి రంగన్న,మార్కెట్ డైరెక్టర్ గోవర్ధన్,భాస్కర్ రెడ్డి,బ్రహ్మయ్య,చక్రాల గ్రామ ప్రజలు తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మామిడి కాదు మాయ



'ఇది నిజగా మామిడిపడా? లేక ఐస్‌కీమా?'... సోషల్ మీడియాలో ఇపుడు అదరినీ ఆశరపరుసున పశ ఇదే! పడ ఆకారలో, నిజమైన పడ మాదిరిగానే కనిపిచే 'హైపర్ రియలిసిక్ ఫ్రూట్ ఐస్‌కీమ్'లు పసుత వైరల్‌గా మారాయి. మామిడి, సాబెరీ, బ్లూ బెరీ, నిమ ఇలా ఏ పడునైనా అచ నిజమైన రూపలో తయారు చేసి అదులో ఐస్‌కీమ్ నిపడ ఈ డెజర్ పతేకత. ఫుడ్ ఆర్, కులినరీ కియేటివిటీ కలయికగా రూపొదుతున ఈ ఐస్‌కీమ్‌లు చూడటానికి కళాఖడాలా ఉటాయి. మొదట చూసినవారికి అవి నిజమైన పడేనని అనిపిసుది. కట్ చేసిన తరాత మాతమే లోపల కీమీ ఐస్‌కీమ్ ఉదని తెలుసుది. కళకు నిజమైన విదు చేసే డెజర్‌గా ఇవి యువతను విపరీతగా ఆకటుకుటునాయి. పతేకగా ఇన్‌సాగామ్, యూటూబ్ షార్ వీడియోలో ఈ ఫ్రూట్ ఐస్‌కీమ్‌లు మిలియన వూస్ సపాదిసునాయి. ఫుడ్ బాగరు, షెఫ్‌లు వీటిని కొత ఫాషన్ డెజర్‌గా పమోట్ చేసునారు. రుచితోపాటు రూపానికి కూడా పాధాన పెరిగిన ఈ కాలలో, ఈ ఐస్‌కీమ్‌లు ఆహారానికి కొత అదాని తీసుకొచాయని చెపాలి.

## మహిళల స్వయం ఉపాధికి ఫెమినా మహిళ సేవా మండలి ఆదర్శం ఉచిత బ్యూటీషన్, కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు మైనారిటీ మహిళలకు ఉపాధి మార్గం చూపుతున్న అలియా సుల్తానా సేవలు ప్రశంసనీయం




**వార్త పత్రిక షాద్ నగర్ మే23:**షాద్‌నగర్ పట్టణంలోని 14వ వార్డు పరిధిలో ఫరూక్‌నగర్ ఉర్దూ ప్రైమరీ స్కూల్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్ర భవనంలో ఫెమినా మహిళ సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 90 రోజుల ఉచిత బ్యూటీషన్ మరియు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రముఖ సామాజికవేత్త, సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు శనివారం సందర్శించారు. ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రముఖ సంఘ సేవకురాలు అలియా సుల్తానా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ముస్లిం మైనారిటీ మహిళలు, నిరుద్యోగ యువతులు స్వయం ఉపాధి సాధించే లక్ష్యంతో ఉచితంగా బ్యూటీషన్ కోర్సులు, కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ వెంకన్న బాబు పేర్కొన్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళల ఆర్థిక సాధికారత డాక్టర్ వెంకన్న బాబు మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా శిక్షణ ఇవ్వడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. శిక్షణ పొందిన మహిళలు మరికొందరికీ ఈ నైపుణ్యాలను అందిస్తూ సేవా భావంతో ముందుకు రావాలని సూచించారు. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల సహకారం అభినందనీయం ఈ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించి ప్రోత్సహించడం, 14వ వార్డు కౌన్సిలర్ అందె మోహన్ సహకారం అందించడం సంతోషకర విషయమని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, సేవా సంస్థలు కలిసి పనిచేస్తే సమాజంలో మంచి మార్పులు తీసుకురాగలమని అభిప్రాయపడ్డారు. అలియా సుల్తానా సేవాభావం ఆదర్శం ఈ సందర్భంగా అలియా సుల్తానా మాట్లాడుతూ "మానవసేవే మాధవ సేవ" అనే భావనతో ఎలాంటి పారితోషికం ఆశించకుండా స్వచ్ఛందంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నానని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే విధంగా మహిళలకు ఉచిత శిక్షణ అందిస్తూ వస్తున్నానని, ఇకముందు కూడా తన శాయశక్తులా మరింత మెరుగైన శిక్షణలు అందించేందుకు అందరి ప్రోత్సాహంతో ముందడుగు వేస్తానని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర నిర్వహణకు అవసరమైన పరికరాలు, సామాగ్రి అందజేస్తూ సహకరిస్తున్న స్వచ్ఛంద సంస్థల నాయకులు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సేవ చేయడంలో కలిగే ఆనందం సంపాదనలో ఉండదు. సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం నా లక్ష్యం" అని ఆమె పేర్కొన్నారు. 30 మంది మహిళల పాల్గొనడం ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది ముస్లిం మైనారిటీ మహిళలు, నిరుద్యోగ యువతులు పాల్గొన్నారు. శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు పొందాలని వారు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# టేకులపల్లి మండలంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య విస్తృత పర్యటన



**వార్తాపత్రిక:టేకులపల్లి,మే23(ప్రతినిధి:బోడ.శ్రీకాంత్)**

**●రూ.1.33 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**●ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేసిన ఎమ్మెల్యే**
**●లచ్చగూడెంలో నూతన పంచాయతీ భవనం, బొమ్మనపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం**

టేకులపల్లి మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య శనివారం విస్తృతంగా పర్యటించారు. ప్రజా ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామాల రూపురేఖలు మార్చడమే ధ్యేయంగా సాగుతున్న ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. తడికలపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో రూ. 1 కోటి 33 లక్షల భారీ వ్యయంతో నూతనంగా చేపట్టనున్న కల్వర్ట్ స్లాబ్,సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య భూమిపూజ చేసి,శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పెట్రాం చెలక బ్రిడ్జి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,నాణ్యతా ప్రమాణాలతో పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అర్హులైన పేదలందరికీ అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కిష్టారం,లచ్చగూడెం గ్రామాలలో విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఆత్మీయ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఆయా గ్రామాలలో పర్యటించి, లబ్ధిదారులతో కలిసి స్వయంగా గృహప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదవాడి సొంతింటి కల నెరవేరడం సంతోషంగా ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. లచ్చగూడెం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని గ్రామ పాలకవర్గంతో కలిసి ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదేవిధంగా, బొమ్మనపల్లి గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్,ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు,టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యామ్ మోహన్,జిల్లా కమిటీ సభ్యులు కాలే ప్రసాద్,ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బదిలీల్లో బేరం!



**●ఆఫీసు బేరర్స్ పేరిట తప్పుడు సర్టిఫికెట్లు**
**●ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లలో అక్రమాలు**
**●ఏండ్లుగా ఒకేచోట పోస్టింగులు**
**●అన్యాయానికి గురవుతున్న అర్హులు**

**హనుమకొండ, మే 23 :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగుల బదిలీ ప్రక్రియ అభాసుపాలవుతున్నది. నిబంధనల అమలుపై సర్కార్ దృష్టి పెటకపోవడంతో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నది. బదిలీల నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిన 'ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్' అర్హతను ఎక్కువ మంది ఉద్యోగులు అక్రమంగా వాడుకుంటుండగా, అర్హులకు అన్యాయం జరిగేలా ఈ వ్యవహారం సాగుతున్నది. బదిలీల ప్రక్రియలో భాగంగా అన్ని శాఖల ఉద్యోగులు ఇప్పటికే ఆప్షన్లు ఇచ్చారు. నాలుగేండ్లు ఒకేచోట పని చేసిన వారిని బదిలీ చేయాలని ప్రభుత్వం నిబంధనల్లో పేర్కొన్నది. ఎస్సీ అభివృద్ధి శాఖలో ఎనిమిదేండ్లు గడిచినా ఒకేచోట పని చేసేలా నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నదనే ఫిర్యాదులు పెరుగుతున్నాయి. తెలంగాణ సమాచారం ఎస్సీ అభివృద్ధి శాఖకు సంబంధించి జోన్ 4 పరిధిలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని గ్రేడ్ 1, గ్రేడ్ 2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, వార్డెన్లు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు బదిలీల కోసం ఆప్షన్లు ఇచ్చారు. వీరికి ఎస్సీడీడీ కమిషనర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ద్వారా సీనియారిటీ ప్రాతిపదికన బదిలీలు జరుగుతాయి. ఆప్షన్లు ఇచ్చిన వారి సీనియారిటీ జాబితాను జోనల్ నోడల్ ఆఫీసర్ హోదాలో హనుమకొండ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రూపొందిస్తారు. ఈ నెల 28లోపు ఈ ప్రక్రియ ముగియనుండగా, జాబితా రూపకల్పన సమయంలోనే నిబంధనలను ఉల్లంఘిస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు (ఆఫీస్ బేరర్) కోటాలో అనర్హులను బదిలీల నుంచి మినహాయించి పాత పోస్టింగులోనే కొనసాగించేలా వ్యవహారం జరుగుతున్నదనే ఆరోపణలున్నాయి. 4వ జోన్ పరిధిలో 40 మంది ఉద్యోగులకు బదిలీ అర్హత ఉన్నది. అయితే వీరు ఆప్షన్లు ఇచ్చిన 10 పోస్టులను ఉద్యోగ సంఘాల నాయకుల కోటాలో కొత్త వారు రాకుండా బ్లాక్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అందరూ ప్రతినిధులే..**

ప్రభుత్వం నిర్వహించే బదిలీల ప్రక్రియ లో స్పౌజ్, మెడికల్, వితంతువుతోపాటు గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు మినహాయింపు ఉంటుంది. ఈ మేరకు ఉద్యోగ సంఘాల జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. సచివాలయం, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, విద్య శాఖలోని సంఘాలే కాకుండా తెలంగాణ నాన్ గెజిటెడ్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్లు మాత్రమే ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఈ సంఘాల్లోనూ ప్రెసిడెంట్, ఒక వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ఒక జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్లకు మాత్రమే బదిలీల నుంచి మినహాయింపు లేదా జిల్లా కేంద్రంలో పోస్టింగ్ పొందే అవకాశం ఉంటుంది. ఈ రెండు సంఘాల్లోని ముఖ్య పదవులతో నిమిత్తం లేకండా ఎస్సీ అభివృద్ధి శాఖలోని 10 మంది ఉద్యోగులు ఇతర సంఘాల ప్రతినిధులమని పేర్కొంటూ డిప్యూటీ డైరెక్టర్‌కు లేఖలు అందించినట్లు తెలిసింది. నిబంధలన ప్రకారం ఉద్యోగ సంఘాల ఆఫీసు బేరర్ల కోటాలో బదిలీల నుంచి మినహాయింపు పొందాలంటే 2025 జూలై 31లోపే రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రికార్డులు ఉండాలి. సహకారశాఖ ఏటా నిర్వహించే ఆడిట్‌లోనూ వీరి నియామకాల వివరాలు నమోదై ఉండాలి. ఎస్సీ అభివృద్ధి శాఖలోని పలు సంఘాల పేర్లతో లేఖలను సమర్పించిన వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలిసింది. బదిలీల నుంచి మినహాయింపు ఉన్న సంఘాలను కాకుండా మిగిలిన సంఘాల లేఖలను సమర్పించిన వారికి ఆఫీసు బేరర్ కోటాలో మినహాయింపు ఇస్తుండడం వల్ల అర్హులకు అన్యాయం జరగనున్నది.

**కమిషనర్ ఆఫీసుకు పంపిస్తాం**

జోనల్ పోస్టుల్లో పని చేస్తున్న 144 మంది వార్డెన్లు, ఐదుగురు సూపరింటెండెంట్లు, ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లు బదిలీల కోసం సర్వీస్ మ్యాటర్స్ వివరాలు, ఆఫీస్ బేరర్స్, హెల్త్ సమస్య, స్పౌజ్ వివరాలన్నింటికీ ఆయా జిల్లాల అధికారుల నుంచి సేకరించి కమిషనర్ ఆఫీస్‌కు పంపించాం. మళ్లీ కొత్త ఫార్మాట్ ప్రకారం ఈనెల 28లోపు పంపిస్తాం. ఈనెల 29న బదిలీ కౌన్సిలింగ్ జరుగుతుంది. ఆఫీస్ బేరర్స్, స్పౌజ్, మెడికల్ కోటా వివరాలను బయటకు వెల్లడించలేం.

-- బీ నిర్మల, ఎస్సీ అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ (భద్రాద్రి జోనల్ నోడల్ ఆఫీసర్).

# పాలిసెట్ ఫలితాలు విడుదల వరంగల్ విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్

**వరంగల్:** తెలంగాణ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పరీక్షలో 82.94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 79.92 శాతం మంది, బాలికలు 86.38 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో వరంగల్‌కు చెందిన నామాల లోకేశ్ ఫస్ట్ ర్యాంక్, సూర్యాపేటకు చెందిన బానోతు హేమనాథ్ సెకండ్ ర్యాంక్ సాధించారు. పాలిసెట్‌కు హాజరైన అభ్యర్థులు తమ హాల్ టికె ట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు ఎంటర్ చేసి ఫలితాలను పొందొచ్చు.పాలిసెట్ రిజల్ట్స్ తెలుసుకునేందుకు ఈ లింక్‌పై క్లిక్ చేయండిమే 27 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్ : రాష్ట్రంలో వచ్చే అకాడమిక్ ఇయర్?కు సంబంధించి (2026-27) ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్లకు ఈ నెల 27వ తేదీన కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. అడ్మిషన్ల కమిటీ



సమావేశం ఇటీవలే నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు విడతల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్, పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన విడుదల చేశారు. ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ సీట్లను జూన్ 6వ తేదీన కేటాయిస్తారు. అదే నెల 9వ తేదీన పాలిటెక్నిక్ అకాడమిక్ ఇయర్ ప్రారంభం అవుతుంది. చివరి విడత కౌన్సెలింగ్ జూన్ 6వ తేదీన కేటాయిస్తారు.చివరి విడత కౌన్సెలింగ్ జూన్ 15వ తేదీన ప్రారంభమై 22వ తేదీతో ముగుస్తుంది. జూన్ 27వ తేదీ నుంచి 30 వరకు ఇంటర్నల్ స్లైడింగ్ నిర్వహిస్తారు. అంటే అప్పటికే సీటు పొందిన కాలేజీల్లో ఒక బ్రాంచి నుంచి మరో బ్రాంచికి మారొచ్చు. స్పాట్ అడ్మిషన్లను జులై 1 నుంచి 8 తేదీల మధ్య పూర్తిచేసుకోవాలని అధికారులు నిర్దేశించారు. ఈ నెల 13వ తేదీన పాలిసెట్ నిర్వహించారు. ఈసారి రిజల్ట్స్ విడుదలకు ముందే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేయడం విశేషం.తొలి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇదీ : ఈ నెల 27-31వ తేదీ వరకు ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్, 29వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 29 నుంచి జూన్ 3 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు,కేటాయిస్తారు.చివరి విడత కౌన్సెలింగ్ జూన్ జూన్ 6న సీట్ అలాట్‌మెంట్, 6వ తేదీ నుంచి 9 వరకు ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, 8, 9 తేదీల్లో సీటు పొందిన కాలేజీల్లో రిపోర్టింగ్, 9న విద్యా సంవత్సరం ప్రారంభం.

# చంద్రబాబుకు మేలు చేయాలనే పాలమూరును పడావున పెడుతుండ్రు

**హైదరాబాద్ :** గురువు చంద్రబాబుకు మేలు చేయాలనే ఉద్దేశంతో రేవంత్ రెడ్డి పాలమూరు ప్రాజెక్టును పడావుపెట్టి, తెలంగాణ నీళ్లను దోచుకుపోవడానికి సహాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ మెతుకు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులు 90శాతం పూర్తయితే 10 శాతం పనులు కాంగ్రెస్ ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు.శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాటాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో మిగిలిన 10 శాతం పనులను పూర్తి చేసి వికారబాద్‌కు సాగు, తాగు నీరు అందిస్తారని భావించిన ప్రజలకు నిరాశే ఎదురవుతుందని ఆరోపించారు. 2027 వరకు కొడంగల్‌కు నారాయణ లిఫ్ట్ ద్వారా నీరు



ఇస్తామని చెప్తున్న రేవంత్ రెడ్డి వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలు ఎండపెడుతరా అంటూ ప్రశ్నించారు.వికారాబాద్ జిల్లాకు సాగు, తాగు నీటి ఇచ్చే ఆలోచన సీఎంకు లేదని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే ఒక్కో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పాదయాత్ర చేస్తామంటేనే రేవంత్ దిగి వచ్చిందని అన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ సర్కార్ విఫలం



**హైదరాబాద్, మే 23 :** సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. (శనివారం) ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు.రెండు రోజుల్లో సెంట్రింగ్ కార్మికుల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల తర్వాత తానే స్వయంగా ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని.. న్యాయమైనవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. అధికారంలోకి వస్తే కచ్చితంగా విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు.

# విశ్రాంత ఐపీఎస్ భార్య హత్య కేసు – ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

**జూబ్లీహిల్స్:** ప్రశాసన్‌నగర్‌లో మాజీ ఐపీఎస అధికారి భార్య తనూజ రంజన్ హత్య, బంగారు ఆభరణాల దోపిడీ కేసులో ఇద్దరిని జూబ్లీహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో మాజీ ఐపీఎస అధికారి వినయ్ రంజన్ రే కుటుంబం నివసిస్తోంది. ఈ ఇంట్లో నేపాల్‌కు చెందిన కల్పన కొంతకాలంగా పనిచేస్తోంది.కల్పనకు నేపాల్‌కు చెందిన వికాస్ అనే ప్రియుడున్నాడు. అతను కొన్ని రోజుల క్రితం కల్పన పని చేసే ఇంట్లో దొంగతనం చేయాలని ప్లాన్ చేశాడు. ఇందుకోసం సునీల్ పెర్యార్, సృజనశాయి, నేత్రశాయి, దినేశ్‌శాయి, గణేశ్‌శాయి, శంకంలామా, కాంచనలను ఒక గ్యాంగ్‌లా తయారు చేశాడు. వినయ్‌రంజన్ ఇంట్లో లేని విషయాన్ని కల్పన ఆమె ప్రియుడు వికాస్‌కు తెలియజేసింది. ఈ నెల 7న సృజన్‌శాయి, నేత్రశాయిలను రెక్కీ కోసం వికాస్ పంపాడు. ఆ ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత చోరీకి అనుకూలంగా ఉందని చెప్పారు.దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు : మే 8వ తేదీన రాత్రి ఒంటి గంట సమయంలో బంగారు ఆభరణాల కోసం పక్కా



ప్రణాళికతో ఇంట్లోకి ముగ్గురు చొరబడ్డారు. మిగిలిన నలుగురు ఇంటి బయట కాపలాగా ఉన్నారు. ఇంట్లోకి వెళ్లిన ఈ ముగ్గురు తనూజ రంజన్ నోట్లో గుడ్డలు కుక్కి, చేతులు కట్టేసి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. ఆ తర్వాత మృతురాలి మెడలోని మంగళసూత్రం, రింగులతో పాటు బీరువాలో భద్రపర్చిన నగలు కలిపి మొత్తం 23 తులాల బంగారంతో పరారయ్యారు. ఈ ఘటన అనంతరం నిందితులు నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుని ఉదయం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఎక్కి కాజీపేటలో దిగారు.ఆ దోచకున్న సొత్తును వాటాలుగా పంచుకున్నారు. నాలుగైదు రైళ్లలోకి ఎక్కి కిందకు దిగారు. అప్పటి వరకు కలిసే ఉన్న ముఠా తర్వాత వేర్వేరుగా విడిపోయి పారిపోయారు. ఫేస్‌బుక్ మెస్సెంజర్ ద్వారా మంతనాలు సాగించు కుంటూ యూపీ-నేపాల్ సరిహద్దు ద్వారా పారిపోయేందుకు ప్లాన్ చేసుకున్నారు. కాజీపేట నుంచి దోపిడీ చేసిన ఆభరణాలను మంబయికి తీసుకెళ్లి, అక్కడి సునీల్‌పెర్యార్ తన ఆభరణాలను దిలీప్ బిశ్వకర్మకు విక్రయించాడు. దీంతో వీరిద్దర్ని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు.12 పోలీసు బృందాలతో గాలింపు : ఈ కేసులో ప్రధాన నిందితురాలు కల్పన ఆమె ప్రియుడు వికాస్ పథకం ప్రకారమే దోపిడీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దోపిడీ అనంతరం పరారైన కల్పన ఇది వరకే నేపాల్? చేరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఠాను పట్టుకునేందురు 12 పోలీసు బృందాలు సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను విశ్లేషిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా ప్రస్తుతం ఇద్దరు పట్టుబడ్డారు. మిగతా వారి కోసం వెతుకుతున్నారు. దోపిడీలో పాల్గొన్న నిందితుల్లో ఒకరైన సునీల్?ను ముంబయిలో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించినట్లు తెలిసింది.ఆ ఫోన్‌కాల్‌తో వివరాలు రాబట్టిన వికాస్ : నేపాల్ నుంచి ఉపాధి కోసం కల్పన పుణెకు వచ్చింది. అక్కడ కొంతకాలం ఇళ్లల్లో పని చేసింది. అక్కడ పరిచయమైన వికాస్?తో సన్నిహితంగా మెలిగింది. సరిగ్గా 8 నెలల క్రితం వినయ్? రంజన్? రే ఇంట్లో పని చేస్తున్న నేపాలీ మహిళ బంధువుల ఇంటికి వెళ్తూ కల్పనను ఇక్కడ పనిలోకి కుదుర్చింది. అప్పటి నుంచి ఇంటి పని చేస్తూ నమ్మకంగానే నటించింది. ఈ మధ్య కాలంలో వికాస్? ఫోన్ ?కాల్?తో ఒక్కసారిగా పరిస్థితులు తారుమారయ్యాయి. ఎప్పటికప్పుడు ఆమె పనిచేస్తున్న ఇంటి వాతావరణం, కుటుంబసభ్యుల గురించి వివరాలు తెలుసుకున్నాడు. ఆ ఇంట్లో దొంగతనం చేసేందుకు అనువైన పరిస్థితి గురించి ఫోన్? ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆమెకు దిశానిర్దేశం చేస్తూ వచ్చాడు. చివరకు తన ప్లాన్ ప్రకారం దోపిడీకి పాల్పడ్డాడు.

# హైదరాబాద్ పోలీసుల మరో ఘనత దేశంలోనే తొలి ఏఐ కాప్‌రైటర్

**హైదరాబాద్:** పోలీసులు అంటేనే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. నేరస్థులను పట్టుకోవడం, టెక్నాలజీని ఉపయోగించడం, సైబర్ కేటుగాళ్లను దొరకబట్టడం వంటి అనేక ఛాలెంజింగ్ కేసులను విజయవంతంగా చేధించి.. హైదరాబాద్ పోలీసులు.. ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా హైదరాబాద్ పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫిర్యాదు రికార్డర్ అయిన 'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ బంజారాహిల్స్ టీజీ ఐసీసీసీలో శనివారం ఆవిష్కరించారు.ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్ ద్వారా 10 కిపైగా భాషల్లో కేసులను ఫిర్యాదు చేసే అవకాశం ఉందని సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఇక యాప్‌లో చెప్పిన విషయాలను వెంటనే టెక్స్ట్ రూపంలో మార్చుతుంది. అంతేకాకుండా ఒక భాష నుంచి



మరో భాషకు ట్రాన్స్‌లేట్ చేస్తుందని తెలిపారు. ఇక ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసే సదుపాయం కూడా ఉందని వివరించారు.ఇతర రాష్ట్రాల ప్రజలు, వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు.. ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్ ద్వారా భారీ ఉపశమనం లభిస్తుందని చెప్పారు. బాధితులకు న్యాయం అందించ డానికి భాష అడ్డు కాకూడదు అనే లక్ష్యంతో ఈ ఏఐ కాప్‌రైటర్‌ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. మొదట హైదరాబాద్ పరిధిలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియను వేగం తోపాటు.. కచ్చితత్వంతో పూర్తి చేసేందుకు ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్ ఉపయో గపడుతుందని పేర్కొన్నారు. ఈ యాప్‌ను బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సహకారంతో రూపొందించినట్లు చెప్పారు.ఫిర్యాదు నమోదు చేసే సమయంలో భాష పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురుకావడం.. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం జరగడం.. సమాచారం తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలకు ఈ యాప్‌తో చెక్ పెట్టనున్నారు. హిందీ, తమిళం, బెంగాలీ, మరాఠీ వంటి 10 భారతీయ భాషల్లో మాట్లాడితే.. అది వెంటనే రాతపూర్వకంగా మార్చుతుంది. దీంతో కేసు నమోదు చేయడానికి ఇప్పటివరకు గంటల తరబడి సమయం పడితే.. ఈ ఏఐ కాప్‌రైటర్ క్షణాల్లోనే పని పూర్తి చేస్తుందిఫిర్యాదు రికార్డ్ చేసిన అధికారి వివరాలు, సమయం వంటి వివరాలన్నీ ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో రికార్డ్ అవుతాయి. దీంతో రికార్డులను తారుమారు చేసే అవకాశం కూడా ఉండదని సీపీ సజ్జనార్ తెలిపారు. పోలీసులకు కూడా టైపింగ్ భారం తగ్గడమే కాకుండా.. రికార్డులను కూడా ఈజీగా మెయింటైన్ చేయవచ్చని పేర్కొన్నారు.

# మా తండ్రి హత్యకు కారణం కాంగ్రెస్ నాయకుడు ఆలం ఖానే

**హైదరాబాద్:** మా తండ్రి హత్యకు కారణం కాంగ్రెస్ నాయకుడు ఆలం ఖానే అని ఖాజా మోహిజుద్దీన్ హత్యపై అతని కుమారుడు ఫర్హాన్ ఆరోపించాడు. దుండగులు కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రగాయాలైన ఖాజా మొయినుద్దీన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ క్రమంలో ఫర్హాన్ మాట్లాడుతూ.. మా తండ్రి వక్ఫ్ బోర్డు ఆస్తులు



కాపాడేందుకు కొన్ని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాడని చెప్పాడు.వక్ఫ్ బోర్డు ఆస్తులను ఆలం ఖాన్, అతడి తండ్రి ఆక్రమించి కాలేజీలు నిర్మించారని.. వాటి గురించి ఎప్పటినుండో కేసులు వేస్తూ.. మా ఫాదర్ ఖాజా మోహిజుద్దీన్ పోరాటం చేస్తున్నారని ఫర్హాన్ తెలిపాడు. గత ఆరు నెలల క్రితం అలంఖాన్ మా ఆఫీసుకు వచ్చి నన్ను బెదిరించాడు. గతంలో మా ఆఫీసులకు వచ్చి మరీ దాడులు చేశారు. మా తండ్రిపై దాడి జరగడం ఇది ఆరోసారి. ఇప్పుడు నాకు గానీమా కుటుంబానికి కానీ ఏం జరిగినా ఆలం ఖాన్ దే బాధ్యత అని ఫర్హాన్ అన్నాడు. నాకు నా కుటుంబానికి రక్షణ కలిపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్టు ఫర్హాన్ పేర్కొన్నాడు.

# పెద్దికి పర్సెంటేజ్ కావాల్సిందే.. ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం




**హైదరాబాద్, మే 23:**
తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదల చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. శనివారం తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో.. రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు'..'కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు.. ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. 120 మంది థియేటర్స్ ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది'..

# 'పగటి కలలు కనకండి మీ ఫ్యూచరేంటో మీకే తెలియదు'


**హైదరాబాద్ :** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆ ర్ఎస్ పార్టీల మధ్య ప్రతిష్టాత్మక ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై మాటల యుద్ధం ముదిరింది. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కాంగ్రెస్ కలల ప్రాజెక్ట్ అయిన ఫ్యూచర్ సిటీని వంద శాతం రద్దు చేస్తామంటూ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. "హరీష్ రావు.. బీఆర్ఎస్ పార్టీలో అసలు మీ ఫ్యూచర్ ఏంటో మీకే స్పష్టత లేదు. అలాంటి మీరు తెలంగాణ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారబోతున్న ఫ్యూచర్ సిటీని ఆపుతారా?' అంటూ ట్విట్టర్ ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో ఎద్దేవా చేశారు.ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న హరీశ్ రావు అక్కడ ఉండి ఫ్యూచర్ సిటీని ఆపేస్తాం అంటూ విలేకరుల సమావేశంలో ప్రకటించడాన్ని మంత్రి తప్పుబట్టారు. ఫ్యూచర్ సిటీకి కేటాయించిన ఈ విలువైన ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టడానికి అమెరికాలో హరీశ్‌రావు ఎవరితోనైనా రహస్య ఒప్పందాలు చేసుకున్నారా? అని పొంగులేటి నిలదీశారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ మహానగరంలో కనీసం ఒక్క కొత్త





మెట్రో స్టేషన్ కూడా కట్టని చరిత్ర మీదని విమర్శించారు. అలాంటిది నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ భవిష్యత్తు కోసం ఏకంగా ఒక సరికొత్త గ్లోబల్ సిటీనే నిర్మిస్తుంటే.. అది చూసి ఓర్వలేక, కేవలం రాజకీయ అసూయతోనే ఇలాంటి బాధ్యతారహితమైన విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత పాలకులు కేసీఆర్ కుటుంబ సభ్యుల విలాసాల కోసం ఎక్కడ పడితే అక్కడ వందల ఎకరాల్లో ఫాంహౌస్?లు కట్టుకున్నారని మండిపడ్డారు. కానీ తాము రాష్ట్ర ప్రయోజనాల కోసం, దేశం గర్వించే విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీని కడుతుంటే దానిని ఆపుతామనడం వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవనాన్ని బాగుచేస్తామంటే అడ్డుపడు తున్నారని, లగచర్లలో ఇండస్ట్రీస్ పెట్టి స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలిస్తామంటే కుట్రలు పన్నారని ఇప్పుడు ఏకంగా ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నారని బీఆర్ఎస్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.తాము మళ్లీ అధికారంలోకి వస్తామంటూ హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని కానీ తెలంగాణ రాష్ట్ర ప్రజల పూర్తి ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ కాంగ్రెస్ పార్టీయే భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గులాబీ పార్టీకి ఇక ఎలాంటి ఫ్యూచర్ లేదని కాంగ్రెస్ నిర్మించే ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ఎలాంటి తిరుగులేదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# నిరుద్యోగుల్లో గందరగోళం సృష్టించడానికి జగన్ అండ్ కో కుట్ర చేస్తున్నారు.



**కడప, మే 23 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ , ఆయన సాక్షి మీడియా చేస్తున్న కుట్రలన్నీ విఫలమవుతోండటంతో ఇప్పుడు నిరుద్యోగులలో గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయ నియామకాలు వందకు వందశాతం పారదర్శకంగా జరిగాయని స్పష్టం చేశారు. ఇప్పుడు అక్రమాలంటూ అవాస్తవాలు ప్రచారం చేస్తే ఎవరు నమ్మరని చెప్పుకొచ్చారు. (శనివారం) కడప వేదికగా భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. జగన్ హయాంలో గ్రూప్ వన్ ఉద్యోగాల భర్తీ ఏ విధంగా చేశారో, ఉద్యోగాలు పొందిన వారు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి తెచ్చిన వారు ఎవరో ప్రజలకు తెలుసునని అన్నారు. ఇప్పుడు డీఎస్సీ గురించి జగన్ అండ్ కో మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. దొంగే, దొంగ దొంగ అని అరిచినట్లుగా జగన్ పరిస్థితి ఉందని సెటైర్లు గుప్పించారు. క్రీడాకారుల కోటా ఉద్యోగాలను వందశాతం పారదర్శకంగా ఇచ్చామని స్పష్టం చేశారు. జగన్ అండ్ కో తమ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించమని హెచ్చరించారు. రూపాయి అవినీతి లేకుండా తాము ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. కులాల మధ్య, మతాల మధ్య పెట్టాలనుకున్న చిచ్చు విఫలం కావడంతో ఇప్పుడు నిరుద్యో గులను టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కో చేసే కుట్రల్లో ఎవరూ పావులు కావద్దని సూచించారు. కోర్టు కేసులనేవి ఏ ప్రక్రియలో అయినా ఉంటాయని భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# తిరుమల శ్రీవారి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు నిండిన క్యూ కాంప్లెక్స్‌లు

**తిరుమల:** శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. తిరుగిరులు వారం రోజులుగా కిటకిటలాడుతున్నాయి. దేవ దేవుని దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలిరావడంతో క్యూ కాంప్లెక్స్‌లు నిండిపోయాయి. వేసవి సెలవుల దృష్ట్యా ప్రత్యేక చర్యలు చేపట్టిన టీటీడీ వివిధ శాఖల సమన్వయంతో గతంలో ఎన్నడూ లేని రీతిలో భక్తులకు దర్శనాలు చేయిస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తోంది. వేసవి సెవులు తిరుమల రద్దీ: తిరుగిరులు భక్తజనంతో కిటకిటలాడుతున్నాయి. కొండంత జనం శ్రీవారి దర్శనానికి తరలివస్తున్నారు. వేసవి అంటేనే శ్రీవారి భక్తులకు ప్రత్యేక అనుభూతి. కోరిన కోరికలు తీర్చే కలియుగ వైకుంఠనాథుని తనివితీరా దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. సుమారు 45 రోజుల పాటు దేశ వ్యాప్తంగా



విద్యార్థులకు సెలవులు ఉండటంతో శ్రీవారి దర్శనానికి తరలి వస్తున్నారు. కోనేటి రాయుడిని కొండ భక్తులతో నిండిపోయింది. వారం రోజుల నుంచి తిరుమలకు అధిక సంఖ్యలో భక్తులు చేరుకుంటున్నారు. వైకుంఠ క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి ఉద్యానవన షెడ్లు, ఔటర్ రింగు రోడ్డు క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. రియల్ టైమ్ మానిటరింగ్: సీఎం చంద్రబాబు సూచ నల మేరకు తిరుమలలో టీటీడీ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రణాళి కబద్ధంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణతో భక్తులకు మెరుగైన సేవలను అందిస్తు న్నారు. సమయపా లన, క్యూలైన్ మేనేజ్మెంట్ ద్వారా రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తూ శ్రీవారి దర్శనంతో పాటు వసతి, అన్నప్రసాదాలను అందజేస్తున్నారు. సామాన్య భక్తుల సౌకర్యార్థం వీఐపీ సిఫార్సు లేఖలపై ఇచ్చే దర్శనాలను రద్దు చేశారు. గత శుక్రవారం నుంచి నిన్నటి వరకు సుమారు 6 లక్షల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. వేసవి రద్దీని ముందస్తుగా అంచనా వేసిన టీటీడీ అధికారులు తిరుపతి జిల్లా యంత్రాంగాన్ని అనుసంధానం చేశారు. తోపులాటలు, ట్రాఫిక్, క్రైమ్ వంటి సమస్యలకు తావులేకుండా పోలీసు సిబ్బందిని నియమించారు. 'తిరుమలలో క్యూలైన్, క్యూ కాంప్లెక్స్, భద్రతా వ్యవస్థలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. సుబ్బారాయుడుతో కలిసి క్యూలైన్లు, అన్నప్రసాదాల తయారీ కేంద్రాలనసుబ్బారాయుడుతో కలిసి ఆయన తనిఖీ చేశాం. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వందతులను నమ్మవద్దు.' -వెంకయ్య చౌదరి, టీటీడీ అదనపు ఈవోవారాంతపు సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీ పెరగనున్నందున టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తుల భద్రతతే ప్రధాన లక్ష్యంగా టీటీడీ విజిలెన్స్, పోలీస్ శాఖలతో పాటు మిగిలిన విభాగాలు పనిచేస్తున్నాయి.

# పర్యాటకుల భద్రతకు, రక్షణకు 'పర్యాటక పోలీస్'

ఏపీలో పర్యాటక పోలీసు విధానంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పర్యాటకుల స్వర్గధామంగా మార్చేందుకు కార్యాచరణ చేపట్టారు. దీనికి సంబంధించి సచివాలయంలో పర్యాటక, అటవీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 50 వేల యువతకు ఉపాధి అవకాశాలు: సందర్శకులకు పూర్తి భద్రత కల్పించే లక్ష్యంతో నూతనంగా పర్యాటక పోలీసు విధానాన్ని తీసుకురానున్నట్లు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. దీనిపై త్వరలో క్యాబినెట్‌లో చర్చిస్తామని పవన్ ప్రకటించారు. నాలుగు శాఖలతో కూడిన ఉమ్మడి కమిటీని వేసి, 200 అద్భుతమైన పర్యాటక ప్రాంతాలను గుర్తించి ఐదు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. ఎకో టూరిజాన్ని



అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రంలో సుమారు 50 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఈశాన్య రాష్ట్రాల తరహాలో మన గ్రామాలకు పర్యాటక శోభను తీసుకువచ్చి, పర్యాటకులకు ఇళ్లలోనే బస చేసే సదుపాయాలు కల్పించేలా కొన్ని పైలెట్ ప్రాజెక్టులు చేపట్టాలని వివరించారు. అదే విధంగా కర్నూలులో కృష్ణ జింకలు, నల్లమలలో బైర్లూటి, నెల్లూరులో ఫ్లెమింగో పక్షుల కేంద్రాలను అంతర్జాతీ య ప్రమాణాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచిం చారు. అధికారులకు దిశానిర్దేశం: పర్యాట క ప్రదేశాలకు సంబంధిం చిన రూట్ మ్యాప్‌లు, వసతల పూర్తి వివరాలతో ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించి, టూరి జం సర్క్యూట్ ప్యాకేజీలను అందు బాటులోకి తేవాలని సూచించారు. దేవా దాయ శాఖతో సమన్వయం చేసుకుని, భక్తుల దైవదర్శనంతో పాటు సమీప ప్రకృతి ప్రాంతాలను కూడా కలుపుతూ వినూత్నంగా కాంబో టూరిజం ప్యాకేజీలు డిజైన్ చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళికలు ముందుకు తీసుకెళ్లేందుకు జూన్ 10వ తేదీలోపు అటవీ, పర్యాటక శాఖల మధ్య అవ గాహన ఒప్పందం కుదుర్చుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గడువు నిర్దేశించారు. మరికొన్ని: ఏపీలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర పథకాలు ఉపయోగపడుతు న్నాయి. ఈ విషయంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినా కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో వివిధ పథకాల కింద పెద్దఎత్తున నిధులు కేటాయించారు. ప్రసాద్ పథకం కింద రూ. 25 కోట్ల 32 లక్షలతో అన్నవరం దేవస్థా నంలో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తు న్నారు. సాస్కీ పథకం కింద రూ. 172.35 కోట్లతో గండికోట, అఖండ గోదావరి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద అరకు-లంబసింగి, సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ. 127.39 కోట్లు వెచ్చిస్తున్నారు. ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ కింద రూ. 49.49 కోట్లతో అహోబిలం, నాగా ర్జునసాగర్ ప్రాజెక్టు అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తు తం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు పర్యా టక రంగ అభివృద్ధిలో కీలకం కానున్నాయి.

# చోరీలపై ఉక్కుపాదం: 51 కేసులు ఛేదించి, 60 మంది అరెస్ట్!

**విశాఖపట్నం, మే23:** నగరంలో చోరీలకు అడ్డు కట్ట వేయడంతో పాటు, బాధితులకు సత్వర న్యాయం చేయడమే లక్ష్యంగా విశాఖ క్రైమ్ విభాగం పోలీసులు శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ఏప్రిల్ నెల 'రికవరీ మేళా'లో రికార్డు స్థాయిలో రికవరీ చేసిన సొత్తును బాధితులకు అందజేశారు. ఏప్రిల్ నెలలో కమిషనరేట్ పరిధిలో మొత్తం 68 చోరీ కేసులు నమోదు కాగా, సాంకేతికత, చాకచక్యంతో వ్యవహరిం చిన క్రైమ్ పోలీసులు కేవలం నెల రోజుల్లోనే 51 కేసులను ఛేధించారు. ఈ కేసులతో సంబంధం ఉన్న 60 మంది ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముద్దాయిల నుంచి రూ. 1.04 కోట్ల విలువైన ప్రాపర్టీని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 924.14 గ్రాముల బంగారం, 4.5 కేజీల వెండి మరియు రూ. 3.12 లక్షల నగదు ఉన్నాయి. ఈ సొత్తు ను



పోలీస్ కమిషనర్ (సీపీ) శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా శనివారం బాధితులకు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గడిచిన 22 నెలల్లో విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అద్భుతమైన పని తీరు కనబరిచామని, మొత్తం 9,202 మంది సుమారు రూ. 22 కోట్ల విలువైన ప్రాపర్టీని రికవరీ చేసి అందజేశామని వెల్లడించారు.

# జగన్ పాపం పండింది.. అందుకే 11 సీట్లు



**కడప, మే 23 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పులివెందుల తెలుగుదేశం పార్టీ నేత పేర్ల పార్థసారథి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తర్వాత రిలయన్స్ ఆస్తులను ధ్వంసం చేయలేదా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక రిలయన్స్ వారికే రాజ్యసభ ఇవ్వలేదా? అని నిలదీశారు. సతీశ్‌రెడ్డి, ఆయన అనుచరుల హత్యకు ప్రయత్నం చేశారని విమర్శించారు. సతీశ్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేకపోయినా అందరిపై కేసులు పెట్టారని ప్రస్తావించారు. ఈరోజు(శనివారం) కడప వేదికగా పేర్ల పార్థసారధి రెడ్డి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తన గుండెలో దాగి ఉన్న బాధను చెప్పుకోవడానికి మీడియా ముందుకు వచ్చానని తెలిపారు. 1996లో తనపై హత్యాయత్నం చేశారని గుర్తుచేశారు. తన తమ్ముడు ఉమామహేశ్వరరెడ్డి కేసులో.. ఈసీ గంగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి ముద్దాయిలు కాదా..? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి వివేకారెడ్డిని గొడ్డలితో నరికి చంపి శత్రువులను కూడా భయపెట్టలేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. వివేకా హత్య తర్వాత ఆయన కుమార్తె సుప్రీంకోర్టుకు వెళ్తుంటే ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. వైఎస్ షర్మిలకు ఆస్తి ఇవ్వకుండా జగన్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు.

# శరవేగంగా తుంగభద్ర పనులు.

**బళ్లారి(బెంగళూరు):** ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా మూడు రాష్ట్రాల ఉమ్మడి నీటి ప్రాజెక్టుగా ఉన్న తుంగభద్ర జలాశయం (టీబీడీ)కు క్రస్ట్ గేట్ల అమరిక పనులు చకచకా సాగుతున్నాయి. గేట్లను అధికారికంగా ప్రారంభించేందుకు బోర్డు ఇంజనీర్లు సీడబ్ల్యూసీ అధికారులతో పాటు మూడు రాష్ట్రప్రభుత్వాలను ఆహ్వానం పలకనున్నారు. 33 కొత్త క్రస్ట్‌గేట్ల పనులు దాదాపు పూర్తి అయ్యాయి. అందరి సమక్షంలో త్వరలో ప్రారంభిస్తామని బోర్డు అధికారులు, సెక్రటరీ ఓ.ఆర్.కే రెడ్డి, ఎస్సీ నారాయణ నాయక్, బోర్డు చైర్మన్ పాండ్య తెలిపారు. తెలంగాణా, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల అధికారులకు ఆహ్వానించామని, కేంద్ర జలవనరులు శాఖకు కూడా సమాచారం ఇచ్చామని ఆయన తెలిపారు. ఈనెల చివరిలో అధికారికంగా గేట్లు అపరేషన్ చేయాలా. జూన్ తొలివారం లోనా అనేది స్పష్టత రావడం లేదని ఇంజనీర్లు తెలిపారు. తుంగభద్ర డ్యాంను 1953లో నిర్మించారు.



సాగు, తాగు నీరు అవసరాల కోసం ఈ డ్యాం నీరు వినియోగించేలా ప్రణాళిక చేశారు. 49.5 మీటర్ల ఎత్తు, 162.7 అడుగులు లోతులో డ్యాంను సుమారు 2.441 వేల ఎకరాల్లో నిర్మించారు. డ్యాం నీటి నిల్వ సామర్థం 133 నుంచి 135 టీఎంసీల నిల్వ సామర్థం ఉండేలా నిర్మానం చేశారు. డ్యాంలో నీరు నిల్వ చేరాక నదికి వదిలేందుకు 33 క్రస్ట్ గేట్లు అమర్చారు. సాగు,తాగు నీరుతో పాటు జలవిద్యుత్తు చేసేందుకు అక్కడ హైడ్రోపవర్ జనరేట్ సిస్టం కూడా ఏర్పాటు చేశారు. లో ఏర్పాటు చేసిన గేట్లు వాటి సామర్థం తగ్గిపోయాయి. 2024 ఏడాది ఆగస్టు 10న డ్యాంకు ఉండే 19వ గేటు నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. డ్యాంలో నీరు వృథాగా నదికి వెల్లకుండా, అలాగే డ్యాం మరిత ప్రమాదంలోకి చేరుకోకుండా 19వ క్రస్ట్ గేటు స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాక్ ఏర్పాటుచేసి ఆ ఏడాది రైతులకు, అలాగే ప్రజలకు తాగునీరు అందించారు. అనంతరం సీడబ్ల్యూసీ బృందం, ఏపీ, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కమిటీ నియమించారు. క్రష్ట గేట్ల పరిస్థితి అధ్యయం చేసేందుకు కన్నయ్య నాయుడు లాంటి సీనియర్ ఇంజనీర్లతో అధ్యయనం చేయించారు. నిపుణుల సలహా మేరకు 33 కొత్త గేట్లను సుమారు రూ. 60 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందుకు తక్షణమే గేట్ల తయారీ సంస్థలకు ఈ- టెండర్ ద్వారా పనులు అప్పగించారు. గేట్ల తయారీ, వాటి నాణ్యత పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు డ్యాంకు కొత్తగా 33 గేట్లు తయారీ పనులు పూర్తీ అయ్యాయి. డ్యాం నిర్మాణం సమయంలో గేట్లుకు చైన్ ఆపరేషన్ అప్పట్లో ఉండేది కాదు. కానీ కొత్త విదానంతో కొత్తగా అన్ని గేట్లకూ చైన్ ఆపరేషన్ సిస్టం కల్పించారు. డ్యాంకు బెడ్‌లెవెల్ నుంచి గేట్లు అమర్చే పనులు పూర్తీ అయ్యాయి. చైన్లు అమర్చే పనులు, అలాగే కొత్త గేట్ల నీటిలోతుప్పు పట్టకుండా రంగులు వేసే పనులు చేస్తున్నారు. డ్యాంలో గేట్లు పనులు దాదాపు పూర్తీ కావడం వల్ల అధికారికంగా గేట్లు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

# నేరం జగన్ నైజం గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్


**అమరావతి, మే 23:** మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందులలో వైఎస్ రాజారెడ్డి అకృత్యాలను వివరించారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ కుటుంబం అయితే... జగన్ దాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. జగన్ అరాచక రాజకీయాలపై యువత ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జగన్ బాధితుడు కాదని.. నిందితుడంటూ వ్యాఖ్యానించారు. జగన్ బెంగళూరు నుంచి వచ్చినప్పుడల్లా కొత్త వాదన తెస్తారన్నారు. వివేకా హత్య కేసులో ఏం జరిగిందో నిక్కరు వేసుకున్న కుర్రాడు కూడా చెబుతాడని.. అలాంటి వాటిల్లో కూడా జగన్ అసత్యాలు చెబుతున్నారు' అంటూ దుయ్యబటారు. ఇదీ రాజారెడ్డి చరిత్ర. వైఎస్ కుటుంబంతోనే రాజకీయాలు నేరమయ్యాయని.. రాజకీయాల్లోకి ఫ్యాక్షన్ తెచ్చారని మంత్రి మండిపడ్డారు. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీమలో ఫ్యాక్షనిజానికి అండగా నిలిచిందని ఆరోపించారు. నాటి ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో పార్నపల్లి అనే గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చిందని.. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేతల ఇళ్లకు డ్రిల్ చేసి డైనమేట్లు పెట్టి పేల్చారని.. ఇదీ రాజారెడ్డి చరిత్ర అని చెప్పుకొచ్చారు. ఓ ఇంటిని డైనమేట్లు పెట్టి పేల్చేసిన ఘటనను ఇప్పటికీ



ఎవ్వరూ మరిచిపోలేదన్నారు. తన ప్రత్యర్థుల మీద దాడి చేయించి... అదే సందర్భంలో వేరే చోట ఉన్నట్టు సృష్టించుకోవడం అనేది వైఎస్ కుటుంబంతోనే మొదలైందని అన్నారు. ప్రజలకు నిజాలు చెప్పాలి..కడప జిల్లాలోని లింగాల మండలంలో ముగ్గురు టాప్ లీడర్లను భయపెట్టి లొంగదీసుకున్నారని పయ్యావుల ఆరోపించారు. ఇలాంటివి పదుల సంఖ్యలో పులివెందులలో జరిగాయన్నారు. రాజారెడ్డి నుంచి మొదలుకుని పులివెందులలో జరిగిన ఘటనలపై పుస్తకం వేస్తామన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక సీమలో ఫ్యాక్షన్ కంట్రోల్లోకి వచ్చిందన్నారు. వైఎస్ కుటుంబం మొదలు పెట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను కంట్రోల్ చేయడానికి 30 ఏళ్ళు పట్టిందని తెలిపారు. రప్పా రప్పా అంటే వారితో ఫొటోలు దిగుతారని.. సొంత పార్టీ కార్యకర్త కారు కింద నలిగిపోయినా పట్టించుకోరని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ గొడ్డలి అంటే జగన్ మోహన్ రెడ్డి ఉలికిపాటుకు గురవుతున్నారన్నారు. గొడ్డలిపోటును గుండెపోటుగా చూపించగలరని దుయ్యబట్టారు. 'నిజాలను ప్రజలకు చెప్పాలి... అవగాహన కల్పించాలి. అందుకే గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం... గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్' అని స్పష్టం చేశారు. ముందు విచారించాల్సింది జగన్‌నే..ఓ తరానికి ఉపాధి కల్పించేలా చంద్రబాబు అవకాశాలు సృష్టించారని పయ్యావుల కేశవ్ తెలిపారు. జగన్ ఉపాధి అవకాశాలను పోగొడుతున్నారని మండిపడ్డారు. 800 కంపెనీలను గ్రౌండ్ చేయబోతున్నామన్నారు. 'వ్యవస్థల మీద గొడ్డలి పోటు వేశావ్.. పోలవరం మీద గొడ్డలి వేటు వేశావ్.. పరిశ్రమల మీద గొడ్డలి వేటు వేశావ్.. అందుకే మీది గొడ్డలి పార్టీ. అచ్చెన్న అరెస్ట్ నుంచి చంద్రబాబు అరెస్ట్ వరకు భయం సృష్టించే ప్రయత్నం చేశారు. పొక్లెయిన్లతో జగన్ విధ్వంసం చేస్తే... నిర్మాణానికి పొక్లెయిన్లను వాడుతున్నాం. నేరం జగన్ నైజం.. నేరమయ రాజకీయాలను గతంలో వైఎస్ కుటుంబం మొదలు పెట్టింది.. దాన్ని జగన్ కొనసాగిస్తున్నారు. వివేకాను చంపిందెవరో సునీతమ్మ చెబుతోంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మృతి వెనుక రిలయన్స్ ఉందన్నారు. తిరిగి వారికే రాజ్యసభ పదవి ఉందని బొత్స అన్నారు. దానికి సమాధానం చెప్పగలరా..? వైఎస్ఆర్‌ను ముద్దాయిగా చేసింది జగనే అని ఉండవల్లి అరుణ్ కుమార్ స్వయంగా చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ముద్దాయిగా చేర్చిన పొన్నవోలుకు పదవి ఇచ్చి గౌరవించారు. పాదయాత్రలో అస్వస్థత గురైనప్పుడు విజయమ్మ వెళ్లారు కానీ... జగన్ వెళ్లలేదు. వైఎస్ మరణం వెనుక ముందుగా విచారించాల్సింది జగన్ మోహన్ రెడ్డినేనని లగడపాటి అన్నారు' అని గుర్తు చేశారు. యువకులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని.. ఎవరి చరిత్ర ఏంటో.. యువకులు తెలుసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం చంద్రబాబు పరిశ్రమలు తెస్తున్నారని... జగన్ పరిశ్రమలను తరిమేశారంటూ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆ కేసులో జగన్ హస్తంపై ఓపెన్ పోలింగ్ పెట్టాలి

**అమరావతి, మే 23 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ( తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి రాజారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రౌడీషీట్ ఉందని విమర్శించారు. ఓ కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించి డబ్బు గడించిన చరిత్ర రాజారెడ్డిదని ఎద్దేవా చేశారు. (శనివారం) అమరావతి వేదికగా మీడియాతో ఎంపీ రమేశ్ మాట్లాడారు. ఓ మైన్ ఓనర్‌ను అంతమొందించి రాజారెడ్డి గనులు దక్కించుకుని ధనవంతుడయ్యారని విమర్శించారు. పులివెందులలో రాజారెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని చెప్పుకొచ్చారు. వైఎస్ ఎలా చనిపోయారో అందరికీ తెలుసునని... ఈ విషయంలో జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సెటైర్లు గుప్పించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని, మాజీ మంత్రి వివేకారెడ్డి మరణాన్ని జగన్ వేరేలాగా చిత్రీకరిస్తున్నారని ఎంపీ రమేశ్ అన్నారు. వివేకా హత్య కేసులో జగన్ హస్తం ఉందా..?, లేదా..? అనేది ఓపెన్ పోల్ పెట్టాలని సవాల్ చేశారు. ఈ కేసుతో జగన్‌కి సంబంధం లేదని వస్తే తాను రాజకీయాలు వదిలేస్తానని ఛాలెంజ్ చేశారు. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాల గురించి తెలిసిపోయిందని.. అందుకే ఆయన ఇప్పుడు



తాను మంచివాడిని అని చెబుతున్నారని అన్నారు. వివేకా కేసులో సీబీఐ విచారణ చేసి భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసిందని ప్రస్తావించారు. ఎస్టీ కులాన్ని అడ్డుపెట్టుకుని రాజారెడ్డి దోపిడీలు చేశారని.. ఇలా పోలీసుల రికార్డుల్లో కూడా ఉందని గుర్తుచేశారు. పులివెందులలో పార్నపల్లి గ్రామంలో రాజారెడ్డి చేసిన ఆకృత్యాలకు ఇంకా సజీవ సాక్షులు ఉన్నారని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి ఎందరినో రాజకీయ లబ్ధి కోసం హత్య రాజకీయాలు చేశారని ఆరోపించారు. రాజారెడ్డిని హత్య చేసింది ఆయన వల్ల ఇబ్బంది పడిన బాధితులేనని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి మీద రౌడీషీట్ సహా పలు కేసులు గతంలో ఉన్నాయని ప్రస్తావించారు. ఆ సమయంలో చంద్రబాబు సీఎం కాదని.. టీడీపీ ప్రభుత్వమే లేదని సీఎం రమేశ్ పేర్కొన్నారు.

# లద్దాఖ్‌లో కుప్పకూలిన ఆర్మీ హెలికాప్టర్- ముగ్గురు అధికారులకు గాయాలు

**లద్దాఖ్ :** సెక్టార్‌లో భారత సైన్యానికి చెందిన చీతా అనే హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు, డివిజన్ కమాండర్ మేజర్ జనరల్ సచిన్ మెహతా గాయపడ్డారు. అయితే వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించేందుకు ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు. బుధవారం (మే 20న) ఈ ప్రమాదం జరగ్గా, ఆలస్యంగా (శనివారం) వెలుగులోకి వచ్చింది. అసలేం జరిగిందంటే లద్దాఖ్‌లోని లేహ్ సమీపంలో ఉన్న పర్వత ప్రాంతమైన టాంగ్‌స్టేలో ఇండియన్ ఆర్మీకి చెందిన చీతా హెలికాప్టర్ బుధవారం కూలిపోయింది. ఈ ప్రమాదంలో మేజర్ జనరల్‌తో సహా ముగ్గురు భారత ఆర్మీ అధికారులు ప్రాణాపాయం నుంచి త్రుటిలో బయటపడ్డారు. ఈ క్రమంలో స్వల్పంగా గాయపడ్డారు. వారు విమాన శిథిలాల నుంచి నడుచుకుంటూ బయటికి వచ్చారు. ఈ పరిణామాన్ని ఆర్మీ అధికారులు ఒక అద్భుతంగా అభివర్ణించారు. ప్రమాదంపై విచారణకు ఆదేశంసింగిల్ ఇంజిన్ హెచ్ఏఎల్ చీతా హెలికాప్టర్‌ను లెఫ్టినెంట్ కల్నల్, మేజర్ నడిపారు. అందులో మూడో పదాతిదళ విభాగం జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ సచిన్ మెహతా ప్రయాణికుడిగా ఉన్నారు. లద్దాఖ్‌లోని ఎత్తైన పర్వత



ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అయితే ఈ యాక్సిడెంట్ జరగడానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు ఆర్మీ అధికారులు అధికారిక విచారణకు ఆదేశించారు. విమానం కుప్పకూలినా అందులోని సిబ్బంది అందరూ ప్రాణాలతో బయటపడటం అసాధారణ విషయంగా ఉందని ఆర్మీ అధికారులు అభిప్రాయపడ్డారు. ఫ్రెంచ్ అలోయెట్ లైసెన్స్ నిర్మిత వెర్షన్ అయిన చీతా హెలికాప్టర్ ముఖ్యంగా సియాచిన్ గ్లేషియర్ వంటి ఎత్తైన ప్రాంతాలలో భారత సైన్యానికి చాలా కాలంగా కీలకం ఉంది. అయితే చీతా విమానాలు ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విమానాలపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. గత 10-12 సంవత్సరాలలో 15కు పైగా చీతా, చేతక్ హెలికాప్టర్లు ప్రమాదాలకు గురయ్యాయి. ఈ యాక్సిడెంట్లలో పలువురు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో ఇండియన్ ఆర్మీ విస్తృత ఆధునీకరణ చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా భారత సైన్యం రాబోయే ఒకటి నుంచి రెండు ఏళ్లలో పాతబడిన హెలికాప్టర్లను క్రమంగా తొలగించి, వాటి స్థానంలో కొత్త తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ భర్తీ ప్రక్రియ రాబోయే 8-10 సంవత్సరాల పాటు కొనసాగే అవకాశం ఉంది. కార్యాచరణ అవసరాలను తీర్చడానికి సైన్యానికి సుమారు 250 కొత్త హెలికాప్టర్లు అవసరం. ఇండియన్ ఆర్మీ విమానాల కొనుగోలు విషయంలో రెండు విధాల వ్యూహాన్ని అనుసరించాలని యోచిస్తోంది. తక్షణ కార్యాచరణ లోపాలను పూడ్చడానికి స్థానికంగా తయారైన తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్లను ఉపయోగించుకోవడంతో పాటు, అవే తరహా హెలికాప్టర్లను లీజుకు కూడా తీసుకోవాలనుకుంటోంది. ఈ పరివర్తనలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తోంది. గంటకు 220 కిలోమీటర్ల గరిష్ఠ వేగం, 6.5 కిలోమీటర్ల సర్వీస్ సీలింగ్, 350 కిలోమీటర్ల కార్యాచరణ పరిధిని సాధించేలా రూపొందించిన ఆరు పరిమిత శ్రేణి తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్ల కోసం సైన్యం ఇప్పటికే హెచ్ఏఎల్‌కు ఆర్డర్ ఇచ్చింది. హెచ్ఏఎల్ సాయుధ దళాల కోసం 625 చీతా, చేతక్ హెలికాప్టర్లను లైసెన్స్‌పై ఉత్పత్తి చేసింది. భారతదేశంలో చీతా హెలికాప్టర్‌ను తయారు చేయడానికి హెచ్ఏఎల్ 1970లో ఫ్రెంచ్ ఏరోస్పేస్ కంపెనీ ఏరోస్పేషియల్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. అంతకుముందు, 1962లో చేతక్ హెలికాప్టర్‌ను ఉత్పత్తి చేయడానికి ఎయిర్‌బస్‌లో భాగమైన ఫ్రెంచ్ సంస్థ సుడ్ ఏవియేషన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారత సైన్యం, వైమానిక దళం నుంచి కనీసం 187 తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్ల కోసం సంయుక్త ఆర్డర్లు వస్తాయని హెచ్ఏఎల్ ఆశిస్తున్నట్లు ఆ సంస్థ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న చీతా విమానాలు లైఫ్ ఇంకొంత కాలం ఉందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ అత్యంత క్లిష్టమైన ఎత్తైన ప్రాంతాలలో కార్యకలాపాల కోసం, ఈ విమానాలను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నాయి. లద్దాఖ్ విమాన ప్రమాదం వంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి వీలైనంత త్వరగా సమగ్ర, కార్యాచరణ విచారణను పూర్తి చేస్తామని వెల్లడించాయి.


# భవిష్యత్‌లో యుద్ధాలు కేవల సరిహద్దుకే పరిమితం కావు



**న్యూ ఢిల్లీ :** భవిష్యత్ యుద్ధాలు సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా మల్టీ-డొమైన్ విధానంలో జరుగు తాయని భారత సాయుధ దళాల చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యానించారు. భూభాగం, సముద్రం, గగనం మాత్రమే కాకుండా సైబర్, కాగ్నిటివ్ వార్‌ఫేర్ వంటి రంగాలు కూడా యుద్ధాల్లో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక యుద్ధాలు ఇకపై కేవలం సైనిక బలం, సంప్రదాయ ఆయుధాలు లేదా ప్లాట్‌ఫామ్ ఆధారిత ఆపరేషన్లతో మాత్రమే పరిమితం కావని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లాలో ఒక రక్షణ తయారీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జనరల్ అనిల్ చౌహాన్ ఈమేరకు వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధ (ఏఐ), డ్రోన్లు, రోబోటిక్స్, సైబర్ సిస్టమ్స్, ఆటోనమస్ ప్లాట్‌ఫామ్స్, అంతరిక్ష సాంకేతికతలు భవిష్యత్ యుద్ధాలకు నిర్ణయాత్మక రూపం ఇస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో సాంకేతికత, వేగం, ఆవిష్కరణలే విజయవంతమైన సైనిక ఆపరేషన్లను నిర్ణయిస్తాయని సీడీఎస్ తెలిపారు. భవిష్యత్‌లో యుద్ధభూములు కేవలం భౌగోళిక ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావని, సమాచార నెట్‌వర్క్‌లు, డిజిటల్ ఎకోసిస్టమ్‌లు, సైబర్ మౌలిక వసతులు కూడా యుద్ధరంగాలుగా మారతాయని ఆయన హెచ్చరించారు. ఏ దేశం వేగంగా సాంకేతిక ఆవిష్కరణలు చేస్తుందో, రక్షణ ఉత్పత్తిని త్వరగా పెంచుతుందో, అలాగే తమ సాయుధ దళాలను కొత్త పరిస్థితులకు వేగంగా అనుగుణంగా దేశానికే వ్యూహాత్మక ఆధిక్యం జనరల్ చౌహాన్ అన్నారు.

# రష్యా సైన్యంలోని 49 మంది భారతీయులు మృతి

**న్యూఢిల్లీ:** రష్యా సైనిక దళంలో పనిచేస్తున్న 49 మంది భారతీయలు.. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో మృతిచెందినట్లు సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రష్యా దళంలో మొత్తం 217 మంది భారతీయులు ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిపై ఓ నివేదికను సుప్రీంకోర్టుకు ప్రభుత్వం అందజేసింది. ఆ నివేదిక ప్రకారం.. రష్యన్ ఆర్మీలో చేస్తున్న సుమారు 139 మంది భారతీయులను కాంట్రాక్టు నుంచి తప్పించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రష్యా, ఉక్రెయిన్ వార్‌లో 49 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆ రిపోర్టులో పేర్కొన్నారు.ష్యా వైపు ఆరుగురు భారతీయ సైనికులు మిస్సింగ్‌లో ఉన్నారు. మరో 23 మంది ఎక్కడ ఉన్నారో స్పష్టంగా తెలియదు. మాస్కోలో ఉన్న భారతీయ ఎంబసీ వారి కోసం అన్వేషణ కొనసాగిస్తుందని ఆ రిపోర్టులో చెప్పారు. విదేశాంగ శాఖ సమాచారం ప్రకారం.. 217 మంది భారతీయులు.. రష్యా సైనిక దళంలో చేరినట్లు తెలుస్తోంది. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని ఓ పిటీషనర్ కోర్టులో కోరారు. రష్యా 26 మంది భారతీయుల్ని తమ ఆధీనంలో ఉంచుకుందని, వారిని ఉక్రెయిన్‌తో వార్‌లో పోరాడేలా వత్తిడి చేస్తోందని, వారిని ఎలాగైన భారత్‌కు తీసుకురావాలన్న డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో దాఖలైన పిటీషన్‌పై ప్రభుత్వం స్పందించింది.



# ప్రపంచ దేశాలన్నీ భారత్ అభివృద్ధి ప్రయాణంలో భాగం కావాలని కోరుకుంటున్నాయ్

**న్యూ ఢిల్లీ :** రోజ్‌గార్ మేళాలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 51 వేల మందికి పైగా యువతకు ఉద్యోగ నియామక పత్రాలను వర్చు వల్‌గా అందజేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్రం తీసుకొచ్చిన ఈ కార్యక్రమాన్ని 47 ప్రాంతాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ కార్య క్రమం సందర్భంగా ప్రధాని మోదీ వివిధ అంశాలపై మాట్లాడారు. నియామక పత్రాలు అందుకున్న యువత రైల్వే, బ్యాంకింగ్, రక్షణ, ఆరోగ్యం, విద్యా రంగాలలో కొత్త బాధ్యతలు స్వీకరిస్తూ దేశ అభివృద్ధిలో కీలక భాగస్వాములు కాబోతున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 'వికసిత్ భారత్' సంకల్పాన్ని నెరవేర్చడంలో ఈ యువశక్తి ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆయన ఆకాంక్షించారు. దేశ యువత, సాంకేతిక ప్రగతి పట్ల ప్రపంచం ఎంతో ఉత్సాహంగా ఉందని చెప్పారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ అభివృద్ధి ప్రయాణంలో భాగం కావాలని కోరుకుంటున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 18 విడతలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 12 లక్షల మందికి పైగా యువతకు నియామక పత్రాలను అందజేశారు."నేను కేవలం రెండు రోజుల క్రితమే ఐదు దేశాల పర్యటనను ముగించుకుని తిరిగి వచ్చాను. చెప్పడానికి ఇవి కేవలం ఐదు దేశాల పర్యటనే అయినప్పటికీ, ఈ సమయంలో నేను డజన్ల కొద్దీ దేశాలకు చెందిన పెద్ద పెద్ద కంపెనీల లీడర్లతో మాట్లాడటం జరిగింది. వారితో విస్తృతంగా చర్చలు, సమావేశాలు జరిగాయి. అయితే ప్రతి చోటా నేను ఒక విషయాన్ని స్పష్టంగా గమనించాను. ప్రపంచం మొత్తం భారతదేశ యువతను చూసి, అలాగే భారతదేశ సాంకేతిక ప్రగతిని చూసి ఎంతో ఉత్సాహంగా ఉంది. ఈ రోజు ప్రపంచం భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వామి కావాలని కోరుకుంటోంది. భారత్ కూడా ప్రపంచంలోని వివిధ దేశాలతో భాగస్వామ్యాన్ని పెంచుకుంటోంది. దీని ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, దేశ యువతకు మరిన్ని అవకాశాలు లభించాలి. ఉపాధి దొరకాలి. వారి సామర్థ్యం మరింతగా పెరగాలి. వీటితో పాటుగా దేశ యువతకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కూడా లభించాలి" అని మోదీ తెలిపారు.



# ఎవరెవరికి ఎంత అందిందో బయటపెట్టనా.. హర్భజన్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సీటును అమ్మేసిందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు టీమిండియా మాజీ స్పిన్నర్, రాజ్యసభ ఎంపీ హర్భజన్ సింగ్ . ఆప్ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికై.. బీజేపీలో చేరడంపై ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు బజ్జీ ఘాటుగా స్పందించారు. అందరి ప్రశ్నలకు సమయం వచ్చినప్పుడు కచ్చితంగా సమాధానం చెబుతానన్నారు హర్భజన్.. తాను ఎప్పుడూ, ఎవరి గురించి తప్పుగా మట్లాడలేదని, విమర్శలు చేయలేదన్నారు. తనను ద్రోహి అనే వాళ్లు.. ముందు వాళ్ల పార్టీలో నేతలు రాజ్యసభ సీటును ఎంతకు అమ్ముకున్నారో అడగాలని హితవు పలికారు. ఒకవేళ వాళ్లు చెప్పకపోతే ఎవరికి ఎంత అందిందో, ఎవరి వైపు నుంచి ఎంత ఇచ్చారో తాను చెబుతానన్నారు. పంజాబ్ ప్రజల్ని దోచుకోవడానికి మంత్రులు, అధికారులు ఎలా మోసం చేశారో కూడా తానే చెబుతానని బాంబ్ పేల్చారు. పంజాబ్‌ను పూర్తిగా దోచుకుని నాశనం చేశారంటూ ధ్వజమెత్తారు. ఆ పార్టీ నాయకుడికి పంజాబ్‌పై ప్రేమ ఉంటే బావుండేది అంటూ కేజ్రీవాల్‌పై పరోక్షంగా విమర్శలు చేశారు. రాజ్యసభ ఎంపీ హర్భజన్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ నేతలు కౌంటరిచ్చారు. హర్భజన్ వ్యాఖ్యలు పంజాబ్‌లో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాయని.. ఆప్‌లో రాజ్యసభ సీటును అమ్మేసిన వారి వివరాలు చెప్పాలన్నారు. ఈ ఆరోపణలపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హర్భజన్ ఆప్ రాజ్యసభ ఎంపీ పదవులు అమ్ముకుందంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఎలా స్పందిస్తారో చూడాలి. టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ పంజాబ్ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. అయితే ఇటీవల బజ్జీ తోటి ఆప్ ఎంపీలతో కలిసి బీజేపీలో చేరిరాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. అయితే న సంగతి తెలిసిందే. హర్భజన్ బీజేపీలో చేరడంపై విమర్శలు వచ్చాయి.. ఈ క్రమంలో ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నపై స్పందిస్తూ బజ్జీ సీరియస్ అయ్యారు. ఆప్ రాజ్యసభ ఎంపీ పదవుల్ని అమ్మేసిందంటూ సంచలన ఆరోపణలు చేశారు.



# 2025 యూఎన్ మిలిటరీ జెండర్ అవార్డు గెలుచుకున్న మేజర్ అభిలాష

**న్యూయార్క్:** మేజర్ అభిలాష బరాక్‌కు అరుదైన గౌరవం దక్కింది. లెబనాన్‌లో ఐక్యాసమితి శాంతి మిషన్‌లో పాల్గొన్న భారతీయ పీస్‌కీపర్ మేజర్ అభిలాషను యూఎన్ అవార్డు వరించింది. ప్రతిష్టాత్మక మిలిటరీ జెండర్ అడ్వకేట్ అవార్డును ఆమెకు ప్రకటించారు. 2025 యునైటెడ్ నేషనల్ మిలిటరీ జెండర్ అడ్వకేడ్ ఆఫ్ ద ఇయర్ అవార్డును గెలుచుకున్నట్లు యూఎన్ భారత విభాగం తెలిపింది. పశ్చిమ ఆసియా దేశాల్లోని మహిళలు, టీనేజీ అమ్మాయిల్లో జెండర్ అంశాల్లో చైతన్యం కలిగించిన నేపథ్యంలో అభిలాషకు ఆ గుర్తింపు వచ్చినట్లు యూఎన్‌లోని ఇండియన్ పర్మినెంట్ మిషన్ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నది. లెబనాన్‌లో ఉన్న భారత బెటాలియన్‌లోని ఫిమేల్ ఎంగేజ్మెంట్ టీమ్‌కు ఆమె కమాండర్‌గా ఉన్నారు. లెబనాన్‌లోని యూఎన్ ఇంటీరియం ఫోర్స్‌లో ఆమె సేవలు అందిస్తున్నది. భారతీయ ఆర్మీకి చెందిన మహిళా యుద్ధ హెలికాప్టర్ పైలట్‌గా ఆమెకు రికార్డు ఉన్నది. యూఎన్ పీస్‌కీపర్స్ అంతర్జాయతీ దినోత్సవం సందర్భంగా మే 29వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగే ఈవెంట్‌లో అభిలాషను అవార్డుతో సత్కరించనున్నారు. యూఎన్ పీస్‌కీపర్స్ అవార్డు అందుకున్న మూడవ భారతీయ మహిళగా ఆమె గుర్తింపు పొందారు. గతంలో మేజర్ సుమన్ గవాని, మేజర్ రాధికా సేన్ కూడా యూఎన్ పీస్‌కీపర్స్ అవార్డు గెలుచుకున్నారు.




# మమతా రూపొందించిన ఫుట్‌బాల్ శిల్పం.. కూల్చేసిన బీజేపీ ప్రభుత్వం



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ స్వయంగా రూపొందించిన భారీ ఫుట్‌బాట్ శిల్పాన్ని బీజేపీ ప్రభుత్వం కూల్చివేసింది. కోల్‌కతాలోని ప్రసిద్ధ సాల్ట్ లేక్ స్టేడియానికి గుర్తింపుగా ఉన్న ఈ శిల్పం శనివారం ధ్వంసం కావడం చూసి స్థానికులు నివ్వెరపోయారు. మమతా బెనర్జీ ఆలోచనతో రూపొందించిన ఆ శిల్పాన్ని 2017లో ఫీఫా అండర్-17 ప్రపంచ కప్‌కు ముందు ఏర్పాటు చేశారు. గత టీఎంసీ ప్రభుత్వపు చిహ్నమైన 'బిస్వా బంగ్లా' లోగో కూడా కూడా దీనిపై ఉన్నది. కాగా, మొండెంపై ఫుట్‌బాల్ ఉన్న ఈ స్టాట్యూపై పలు విమర్శలు కూడా వచ్చాయి. దీనిని ఆవిష్కరించినప్పటి నుంచి వివాదాస్పదంగా మారింది. ఈ విచిత్ర డిజైన్‌ను పలువురు ఫుట్‌బాల్ అభిమానులు ప్రశ్నించారు. అయినప్పటికీ అనేక ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ టోర్నీలకు ఆతిథ్యం ఇచ్చిన ఈ స్టేడియానికి ఒక గుర్తింపుగా అది నిలిచింది. మరోవైపు బెంగాల్‌లో బీజేపీ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారి, ఆ మరునాడే ఈ నిర్మాణాన్ని తొలగిస్తామని ప్రకటించారు. క్రీడల మంత్రి నిసిత్ ప్రమాణిక్ కూడా ఈ విషయాన్ని పునరుద్ఘాటించారు. ప్రఖ్యాత స్టేడియం సౌందర్యానికి ఆ 'వికృతమైన' నిర్మాణం ఏమాత్రం తగినది కాదని వ్యాఖ్యానించారు.

# అభిజీత్ దీప్కే అకౌంట్లు హ్యాక్, వెబ్‌సైట్ డౌన్

**న్యూఢిల్లీ:** సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్యంగా రాజకీయ విమర్శలు చేస్తూ, యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం సంచలన ఆరోపణలు చేశారు. తన సోషల్ మీడియా అకౌంట్లు హ్యాక్ అయ్యాయని, తన వెబ్‌సైట్ డౌన్ అయ్యిందని అన్నారు. అందువల్ల ప్రస్తుతం తనకు ఏ ఒక్క అకౌంట్ కూడా అందుబాటులో లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టిన అభిజీత్, చివరకు తన వ్యక్తిగత ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ కూడా హ్యాక్ అయ్యిందని పేర్కొన్నారు. భారతదేశంలో సీజేపీ అధికారిక ఎక్స్ ఖాతాను నిలిపివేసిన రెండు రోజుల తర్వాత, అభిజీత్ 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' అనే కొత్త అకౌంట్ ఓపెన్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన అకౌంట్లు అన్నీ హ్యాక్ లేదా డౌన్ కావడం గమనార్హం. ఆ క్యాంపెయిన్ ఎఫెక్టేనా విద్యా వ్యవస్థలోని లోపాలను, తప్పులను




తూర్పారబట్టిన కాక్రాచ్ జనతా పార్టీ, నీట్-యూజీ 2026 పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని శుక్రవారం ఒక క్యాంపెయిన్ మొదలుపెట్టింది. దీనితో తనను చంపేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని అభిజీత్ దిప్కే ఆరోపించారు. అంతేకాదు సదరు బెదిరింపులకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను కూడా ఎక్స్ వేదికగా చూపించారు. "కాక్రోచ్ జనతా పార్టీపై అణిచివేత మొదలైంది. మా అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీ హ్యాక్ అయ్యింది. చివరకి నా వ్యక్తిగత ఇన్‌స్టాగ్రామ్ ఖాతా కూడా హ్యాక్ చేశారు. మా ఎక్స్ (ట్విట్టర్) అకౌంటను నిలిపివేశారు. మేము పెట్టిన బ్యాకప్ అకౌంట్?ను కూడా తీసేశారు. సీజేపీ వెబ్‌సైట్ కూడా ఇప్పుడు పనిచేయడం లేదు, దానిని తీసేశారు. అందువల్ల ప్రస్తుతం మా అకౌంట్లు ఏవీ మా చేతిలో లేవని దయచేసి గమనించండి. దీని తర్వాత మా పేరుతో వచ్చే ఏ పోస్టును కూడా కాక్రోచ్ జనతా పార్టీ అధికారిక ప్రకటనగా నమ్మకండి. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా తాము చేసిన క్యాంపెయిన్ వల్లే నాపై ఈ చర్యలు తీసుకుంటున్నారు."- అభిజీత్ దిప్కే, కాక్రోచ్ జనతా పార్టీ అకౌంట్ హోల్డర్మంత్రిపై చర్యలు తీసుకోవాల్సిందే!నీట్ పరీక్ష పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర విద్యా శాఖ మంత్రిపై తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అభిజీత్ డిమాండ్ చేశారు. 'నీట్ పేపర్ లీక్ విషయంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఫెయిల్ అవ్వడం వల్ల ప్రాణాలు కోల్పోయిన విద్యార్థి కోసం ఈ చర్యలు తప్పనిసరిగా తీసుకో వాలి. కానీ నేడు ఆ తప్పులను ప్రశ్నించినందుకు కాక్రోచ్ జనతా పార్టీపై యాక్షన్ తీసుకుంటున్నారు' అని ఆయన విమర్శించారు. ఎక్స్‌లో తమ ప్రధాన ఖాతాను మూసివేసిన వెంటనే, బ్యాకప్‌గా 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' అకౌంట్‌ను ఓపెన్ చేశారు. దీనిలో సీజేపీ ఒక పోస్టు చేసింది. అందులో కేవలం వారం రోజుల్లోనే 10 లక్షల మంది సభ్యులు తమ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయ్యారని సీజేపీ తెలిపింది.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలను వక్రీకరించారు

**- అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**



భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల ఒక సోషల్ మీడియా ఇంటర్వ్యూలోరాజకీయ విశ్లేషకుడు సామాజిక సేవకుడు అందరివాడు అయిన మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యానించిన కొన్ని వ్యాఖ్యలను సోషల్ మీడియాకు చెందిన కొందరు వక్రీకరించి నెగటివ్ గా చిత్రీకరించడం జరిగిందని దానికి జనసేన సైనికులు అపార్థం చేసుకుని ప్రొఫెసర్ నాగేశ్వర్ ని తీవ్రంగా విమర్శిస్తూ పోలీస్ స్టేషన్లో కూడా కేసులు పెట్టడం సమంజసం కాదని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్ పై పెట్టిన పోలీస్ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే ఇది ప్రజాస్వామ్య పరిరక్షణకే గొడ్డలి పెట్టు అవుతుందని పేర్కొన్నారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్ మీద కేసులను పెట్టడం సమంజసం కాదంటూ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు శ్రీ నయీమ్ ఖురేషి, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు లావుడియా సత్యనారాయణ, లాల్ సింగ్ నాయక్, న్యాయవాది బానోత్ రమేష్ నాయక్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పి.సురేందర్, మాల మహానాడు జిల్లా నాయకులు సుంద్రు రఘునాథ్ బాబు, శనగ లక్ష్మణ్, టిఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు బొమ్మెర అశోక్, పృథ్వీరాజ్, అంబేద్కర్ సంఘ నాయకులు నరేందర్, రాజేశ్వర్, మాల మహానాడు రాష్ట్ర మహిళ నాయకురాళ్లు బడికెల పుష్పలత, కొదురుపాక మీనాక్షి, కుంచే లావణ్య, జోగు రమాదేవి, మాధవిలత తదితరులు ఖండించారు.

# అభివృద్ధిపై మంత్రిని కలిసిన ఎమ్మెల్యే యరపతినేని



గురజాల, : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం కలిశారు. దాచేపల్లి కొత్త మున్సిపల్ బిల్డింగ్ కి రూ. 2 కోట్లు, గురజాల కొత్త మున్సిపల్ బిల్డింగ్ కి రూ. 2 కోట్లు శాంక్షన్ చేశారు. దాంట్లో రెండు మున్సిపాలిటీల కొత్త బిల్డింగులకు కోటి, కోటి రూపాయలు చొప్పున రిలీజ్ చేస్తున్నారు. రెండు బిల్డింగులు శాంక్షన్ అయ్యాయి అని తెలియజేశారు. గురజాల టౌన్ లోని సుంకర కుంట చెరువు ఆధునీకరణకు రూ. 2.5 కోట్లు ప్రపోజల్ పెట్టాము అని, దీనిని కూడా మంత్రి శాంక్షన్ ఇస్తామని చెప్పారు.

# రాష్ట్రంలో మహబూబాబాద్ జిల్లా మొదటి స్థానం

- ఓటర్ల మ్యాపింగ్‌లో 92.24 శాతం పూర్తి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్, : కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కు ముందస్తు సన్నాహాల్లో భాగంగా మ్యాపింగ్ లో రాష్ట్రంలో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 92.24 శాతం మ్యాపింగ్ చేసి. రాష్ట్రంలోనే ముందు వరుసలో మహబూబాబాద్ జిల్లా ఉందన్నారు. 2002, 2025 రెండు ఓటరు జాబితాల్లోనూ పేర్లు ఉంటే ఓటర్లు ఆధారాల కోసం ఎలాంటి ధ్రువపత్రాలు చూపాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం జరుగుతున్న మ్యాపింగ్‌లో ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్వోలు, భారత్ ఎన్నికల చట్టం ప్రకారం ఓటర్ జాబితా తయారు చేయడం జరుగుతుందని, సవరణలకు పూర్తిగా అధికారం కలిగి ఉందని, ఓటర్ జాబితా యొక్క సమగ్రతను కాపాడడానికి కమిషన్ ప్రతి ఎన్నికలకు ముందు లేదా అవసరాన్ని బట్టి ఓటరు జాబితా సవరణలకు ఆదేశించడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రజలు తరచుగా వలసలు వెళ్లడం వల్ల ఉన్న ఓటరు జాబితాలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, తద్వారా ఓటరు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదు అయి ఉన్నారని, మరణించిన ఓటర్లు పేర్లు తొలగించడం, తదితర సమస్యలను ఉత్పన్నమయ్యాయి అని, అందువలన అర్హుడైన పౌరుడు కూడా ఓటరు జాబితా నుండి తప్పి పోకుండా అలాగే ఏ అనర్హుడు కూడా ఇందులో చేర్చబడుతుందని ముఖ్య లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ను ప్రకటించింది అన్నారు. ఎస్ ఐ ఆర్ సవరణ కోసం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు, ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు మార్నేని వెంకన్న, సురేష్ నాయుడు, శ్యామ్ లోయ శర్మ, చక్రపాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపర్డెంట్ కిరణ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

# ఉద్యోగ నియామక పత్రాలను అందజేసిన కలెక్టర్



ములుగు జిల్లా :ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 8వ తేదీన వరంగల్ వేదికగా జరిగిన మెగా జాబ్ మేళాలో వివిధ ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపికైన ములుగు జిల్లాకు చెందిన 25 మంది యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గారు తన ఛాంబర్ లో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, యువజన ఉ క్రీడా వారోత్సవాలను పురస్కరించుకొని 6వ రోజున జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ములుగు టాస్క్ సెంటర్‌లో "ఉద్యోగ సాధన -- ప్రతిభకు అవకాశాల అనుసంధానం" అనే అంశంపై శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

# ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై నివేదిక సమర్పణ



మహబూబ్ నగర్, :మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారికి సమగ్ర నివేదిక సమర్పించబడింది. నియోజకవర్గంలోని మొత్తం 199 ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన విద్యా సమన్వయకర్తలు జగపతి రావు, హర్షవర్ధన్ రెడ్డి, డి. వెంకటనర్సయ్య యాదవ్, ఫరూక్ హుస్సేన్ పాఠశాలల ప్రస్తుత పరిస్థితులపై నివేదికను సిద్ధం చేసి ఎమ్మెల్యే గారికి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ నివేదికలో పాఠశాలలకు అవసరమైన భౌతిక వనరులు,

మైనర్, మేజర్ మరమ్మత్తులు, మౌలిక వసతుల కల్పన, పాఠ్యాంశాల బోధనకు అవసరమైన విద్యా వాలంటీర్ల నియామకం వంటి కీలక అంశాలపై సమగ్ర సమాచారం పొందుపరచబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి పాఠశాల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించిన విద్యా సమన్వయకర్తల కృషి ప్రశంసనీయమని తెలిపారు. ఇది వారి నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, రాబోయే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు.

# వీటిని చాలా మంది వ్యర్థాలుగా పడేస్తుంటారు.. కానీ ఈ విషయాలు తెలిస్తే ఇకపై పడేయరు..



ఆహారాన్ని వృథా చేయకుండా ప్రతి పదార్థాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడం భారతీయ వంటింటి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా పండ్ల తొక్కలు, గింజలు, మిగిలిపోయిన భాగాలను చాలామంది నేరుగా చెత్తబుట్టలో వేస్తుంటారు. అయితే కొంచెం సృజనాత్మకంగా ఆలోచిస్తే ఇవే రుచికరమైన వంటకాలు, ఆరోగ్యకరమైన స్నాక్స్, శీతల పానీయాలుగా మారవచ్చు. వేసవిలో ఎక్కువగా తినే పండ్ల మిగతా భాగాలను ఇంట్లో ఎలా ఉపయోగించుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. పుచ్చకాయలో ఎర్రని గుజ్జు తిన్న తర్వాత మిగిలే తెల్లని భాగాన్ని చాలామంది పారేస్తారు. కానీ ఈ భాగంతో రుచికరమైన కూర తయారు చేయవచ్చు. బయట గట్టిగా ఉండే ఆకుపచ్చ పొర తీసేసి తెల్లటి భాగాన్ని ముక్కలుగా కోసి ఆవాలు, పచ్చిమిర్చి, పసుపు, ఆమ్‌చూర్‌తో వండితే సొరకాయ కూరలాగే మంచి రుచితో ఉంటుంది. మసాలాలు బాగా పట్టి ప్రత్యేకమైన టెక్స్చర్ ఇస్తుంది. తర్బూజా గింజలు..అలాగే తర్బూజా లేదా మస్క్‌మిలన్ గింజలను కూడా ఆరోగ్యకరమైన స్నాక్‌గా మార్చుకోవచ్చు. గింజలను శుభ్రంగా కడిగి ఎండబెట్టి నెయ్యిలో వేయించి అందులో బ్లాక్ సాల్ట్, చాట్ మసాలా, వేయించిన జీలకర్ర పొడి కలిపితే మంచి కరకరలాడే స్నాక్ సిద్ధమవుతుంది. వీటిని మఖానాల్లా తినవచ్చు. పోహా, చాట్‌లపై టాపింగ్‌గా కూడా ఉపయోగించవచ్చు. నారింజ, నిమ్మ, బత్తాయి తొక్కల్లో సువాసన గల నూనెలు అధికంగా ఉంటాయి. ఈ తొక్కలను ఎండలో లేదా తక్కువ ఉష్ణోగ్రతలో డ్రై చేసి పొడిగా చేసుకుంటే వంటల్లో ఉపయోగించవచ్చు. ఈ పొడిని కేకులు, టీ, మెరినేడ్లు, డెజర్ట్‌లలో కలిపితే మంచి ఫ్లేవర్ వస్తుంది. నిమ్మ, నారింజ తొక్కలు..అదే విధంగా నిమ్మ లేదా నారింజ తొక్కలతో భోజనం తిన్న తర్వాత తీసుకునే చిన్న డైజెస్టివ్ మిఠాయిలను కూడా తయారు చేయవచ్చు. తొక్కలను మరిగించి పాకంలో ఉడికించి తర్వాత చక్కెర, బ్లాక్ సాల్ట్ కలిపితే తీపి, పులుపు, స్వల్ప చేదు రుచులతో ప్రత్యేకమైన క్యాండీలా మారుతుంది. భోజనం తర్వాత తింటే రుచిగా ఉంటుంది. యాపిల్, పియర్, అనాస, బెర్రీల తొక్కలు, మిగిలిపోయిన భాగాలతో ఇంట్లోనే ఫ్రూట్ వెనిగర్ తయారు చేయవచ్చు. ఒక సీసాలో నీరు, చక్కెరతో కలిసి వీటిని కొన్ని రోజులు ఉంచితే సహజంగా ఫర్మెంటేషన్ జరిగి వెనిగర్ తయారవుతుంది. దీనిని సలాడ్ డ్రెస్సింగ్, మెరినేడ్ లేదా ఇంటి శుభ్రత కోసం కూడా ఉపయోగించవచ్చు. పుచ్చకాయ తొక్కలు..నారింజ తొక్కలతో ప్రత్యేకమైన చట్నీ కూడా తయారు చేయవచ్చు. తొక్కలను ముందుగా మరిగించి చేదు తగ్గించి, బెల్లం, చింతపండు, ఎర్ర మిర్చి, వేయించిన జీలకర్రతో గ్రైండ్ చేస్తే తీపి, పులుపు, కారం కలిసిన రుచికరమైన చట్నీ సిద్ధమవుతుంది. సాధారణ దాల్-చావల్‌కే కొత్త రుచి తీసుకొస్తుంది. అనాస, పుచ్చకాయ తొక్కలు లేదా సిట్రస్ పండ్ల మిగిలిన భాగాలతో వేసవికి సరిపోయే శర్బత్ కూడా తయారు చేయవచ్చు. వీటిని చక్కెర, పుదీనా, బ్లాక్ సాల్ట్, కొద్దిగా నిమ్మరసంతో మరిగించి వడగట్టి చల్లబరిస్తే రుచికరమైన సిరప్ సిద్ధమవుతుంది. దీన్ని చల్లని నీరు లేదా సోడాతో కలిపి తాగితే శరీరానికి తేమను అందిస్తుంది. ఆహార వ్యర్థాలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సమస్యగా మారుతున్నాయి. ముఖ్యంగా పండ్ల తొక్కలు, గింజలే ఎక్కువగా వృథా అవుతున్నాయి. కానీ కొద్దిగా శ్రద్ధ పెడితే ఇవే రుచికరమైన వంటకాలు, ఆరోగ్యకరమైన పానీయాలుగా మారి ఇంటి వంటల్లో కొత్త రుచులను తీసుకువస్తాయి.

# ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

**- డాక్టర్ బి సాంబశివరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి**



వరంగల్ జిల్లా : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు గారి అధ్యక్షతన నేడు ఐఎంఎ సమావేశం మందిరం వరంగల్ నందు వైద్యాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో వరంగల్ జిల్లాను అన్ని విభాగాలలో ముందు ఉంచాలని, ప్రత్యేకంగా టీబీ ముక్తి అభియాన్ కార్యక్రమము కింద క్షేత్రస్థాయిలో విస్తృతంగా ఎక్స్ రే క్యాంపులు నిర్వహించి జిల్లాను ముందు ఉంచాలని, అదేవిధంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన మాతా శిశు ఆరోగ్య కార్యక్రమం కింద క్షేత్రస్థాయిలో గర్భిణీ స్త్రీలను గుర్తించి నమోదు చేయించాలని, జాతీయ వ్యాధి నిరోధక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రస్తుతం ఎండాకాలంలో వడగలుల వలన జిల్లాలో ఎవరు వడదెబ్బకు మరణిం చకుండా గ్రామాలలో ప్రత్యేకంగా పని ప్రదేశాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచా లని వడగాలుల పట్ల అవగాహన కార్యక్రమము నిర్వహించాలని తద్వారా వడదెబ్బ మరణాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ,ఆర్ బి ఎస్ కే వైద్యాధికారులు,పల్లె దవాఖాన డాక్టర్లు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు

# ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఇష్టపడే పానీయం టీ.. అసలు ఎక్కడ ఎవరు తయారు చేశారు..



ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది రోజును ఒక కప్పు టీతో ప్రారంభిస్తారు. భారతీయుల జీవితంలో చాయ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రపు చిట్‌చాట్‌ల వరకు టీ దైనందిన జీవితంలో భాగమైపోయింది. అయితే ఇప్పుడు భారతీయుల అభిమాన పానీయంగా మారిన టీ అసలు పుట్టింది మాత్రం భారత్‌లో కాదు. వేల సంవత్సరాల క్రితమే చైనాలో టీ చరిత్ర ప్రారంభమైంది. టీ ఆవిష్కరణకు సంబంధించిన కథ దాదాపు 5 వేల సంవత్సరాల క్రితం చైనాలోని యున్నాన్ ప్రాంతంతో ముడిపడి ఉంది. చారిత్రక కథనాల ప్రకారం చైనా చక్రవర్తి షెన్ నాంగ్ ఒక చెట్టు కింద కూర్చుని ఉండగా పక్కనే నీరు మరుగుతుండేది. ఆ సమయంలో చెట్టు ఆకులు కొన్ని ఆ వేడి నీటిలో పడిపోయాయి. ఆ నీటిని రుచి చూసిన చక్రవర్తి దాని ప్రత్యేక రుచి, ఉల్లాసాన్ని చూసి ఆశ్చర్యపోయాడట. దాన్నే ప్రపంచంలో తొలి టీ కప్పుగా భావిస్తారు. చైనాలో అలాగే తాగుతారు..తర్వాత అనేక శతాబ్దాల పాటు చైనాలో టీని కేవలం పానీయంగా మాత్రమే కాకుండా ఔషధంగా కూడా భావించేవారు. టీ తాగితే మెదడు చురుకుగా పనిచేస్తుందని, జీర్ణక్రియ మెరుగుపడుతుందని, శరీరానికి శక్తి వస్తుందని అక్కడి ప్రజలు నమ్మేవారు. క్రమంగా టీ వారి దైనందిన జీవితంలో భాగమై, ఆ తర్వాత ప్రత్యేక కళారూపంగా కూడా మారింది. చైనాలో సాధారణంగా టీని పాలు, చక్కెర లేకుండా స్వచ్ఛమైన రూపంలోనే తాగుతారు. అలా తాగితే టీ ఆకుల సహజ రుచి పూర్తిగా ఆస్వాదించవచ్చని భావిస్తారు. చైనా వ్యాపారుల ద్వారా టీ యూరప్‌కు చేరింది. 17వ శతాబ్దానికి బ్రిటిష్ ప్రజలు టీకి బాగా అలవాటు పడ్డారు. అయితే టీ వ్యాపారంపై పూర్తిగా చైనాకే ఆధిపత్యం ఉండటంతో బ్రిటన్ కొత్త మార్గాలను వెతకడం ప్రారంభించింది. అదే సమయంలో భారత్‌లో టీ సాగు ప్రారంభమైంది. 20వ శతాబ్దంలో భారత్‌లోకి..మొదట బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ చైనా టీ విత్తనాలను భారత్‌లో నాటే ప్రయత్నం చేసింది. కానీ అసలు మలుపు అస్సాంలో సహజంగా పెరుగుతున్న అడవి టీ మొక్కలను గుర్తించిన తర్వాత వచ్చింది. ఈ టీ రకం చైనా టీ మొక్కలకంటే భిన్నంగా ఉండేది. దీని ఆకులు పెద్దగా ఉండటంతో పాటు చక్కని రుచిని ఇస్తుండేవి. బ్లాక్ టీ తయారికి ఇది ఎంతో అనుకూలంగా మారింది. ఆ తర్వాత అస్సాం, డార్జిలింగ్, నీలగిరి వంటి ప్రాంతాల్లో భారీ స్థాయిలో టీ తోటలు ఏర్పడ్డాయి. అయితే ప్రారంభంలో భారత్‌లో పండించిన టీ ఆకులను ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేసేవారు. భారతీయులు అప్పట్లో పెద్దగా టీ తాగేవారు కాదు. 20వ శతాబ్దంలో జరిగిన ప్రచార కార్యక్రమాల తర్వాతే టీ భారతీయ ఇళ్లలో సాధారణ పానీయంగా మారింది. టీని భారత్ పూర్తిగా కొత్త రూపంలో మార్చింది. చైనాలో స్వచ్ఛమైన టీకి ప్రాధాన్యం ఇస్తే, భారతీయులు అందులో పాలు, చక్కెర, అల్లం, యాలకులు, లవంగాలు వంటి మసాలాలు కలిపారు. అలా మసాలా చాయ్ అనే ప్రత్యేక రుచికరమైన పానీయం రూపుదిద్దుకుంది. భిన్న రకాల రుచులు..చైనా టీ సాధారణంగా మృదువైన, సున్నితమైన రుచితో ఉండి నెమ్మదిగా ఆస్వాదించేందుకు అనుకూలంగా ఉంటుంది. భారతీయ టీ మాత్రం ఘాటుగా, బలమైన రుచితో వెంటనే ఉత్సాహాన్ని ఇచ్చేలా ఉంటుంది. టీ తాగే విధానంలో కూడా రెండు దేశాల మధ్య తేడా కనిపిస్తుంది. చైనాలో టీ తాగడం ప్రశాంతత, ధ్యానంతో ముడిపడి ఉంటే, భారత్‌లో టీ అనేది సంభాషణలతో ముడిపడి ఉంటుంది. కుటుంబ చర్చలు, ఆఫీస్ విరామాలు, మారిపోయింది.

# పెద్దమ్మ జాతర లో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి



మెదక్ జిల్లా, : మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని అహక్కన్నపేట గ్రామంలో జరుగుతున్న ప్రసిద్ధ పెద్దమ్మ జాతర మహోత్సవానికి మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ జాతరలో ఎమ్మెల్యే గారు పాల్గొని గ్రామాభివృద్ధి, భక్తుల సౌకర్యాల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా డా. మైనంపల్లి రోహిత్ గారు మాట్లాడుతూ, "పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రాంతం సుభిక్షంగా, ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నాను. గ్రామంలోని భక్తులకు, నిర్వాహకులకు అన్ని విధాలా ప్రభుత్వ సహకారం అందిస్తాం" అని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited,Printed,Published and Owned by Mare Chinnababu , Printed at sravanthi prienters , Rtc Cross Roads ,Hyderabad - 500020. Published at House No : 223 , Gajula Ramaram , Road 1, Hyderabad - 500020, Telangana. Editor : Mare Chinnababu , (TGTEL/33/B45017) e-mail : vaarthapatrika@gmail.com , Cell : 9490617567 , 99081 21111